RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 246 ISSUE NO : 246 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, మార్చి,27, 2026 Friday, March,27, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



భారత్‌కు అప్పగింత కేసు..

## నీరవ్ మోదీకి మరోసారి

# చుక్కెదురు

ఢిల్లీ,: పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి లండన్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తనను భారత్‌కు అప్పగించే ప్రక్రియను నిలిపివేసి, కేసు విచారణను తిరిగి ప్రారంభించాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను లండన్‌లోని హైకోర్ట్ ఆఫ్ జస్టిస్, కింగ్స్ బెంచ్ డివిజన్ తిరస్కరించింది. ఈ నిర్ణయంతో నీరవ్ మోదీని భారత్‌కు రప్పించే ప్రయత్నాల్లో భారత దర్యాప్తు సంస్థలకు మరో విజయం లభించినట్లయింది. రక్షణ రంగ మధ్యవర్తి సంజయ్ భండారీ కేసులో యూకే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆధారం చేసుకుని నీరవ్ మోదీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆ కేసులో భారత్‌కు అప్పగిస్తే హింసకు గురయ్యే ప్రమాదం ఉందని భండారీ వాదించగా, మానవతా దృక్పథంతో కోర్టు ఆయన అప్పగింతను నిరాకరించింది. అదే తరహాలో తనను కూడా భారత్‌లో హింసిస్తారని, కాబట్టి తన కేసును కూడా మళ్లీ విచారించాలని నీరవ్ మోదీ కోరారు. ఈ విచారణ సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారుల బృందం లండన్‌కు వెళ్లింది.



అన్ని రాష్ట్రాల సీఎంలతో..

# నేడు ప్రధాని భేటీ

ఢిల్లీ,: ఇరాన్ యుద్ధం, సంక్షోభం నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించనున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల సీఎంలతో శుక్రవారం మోదీ సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరున్నర గంటలకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సీఎంలతో చర్చించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశం జరగనుంది. పశ్చిమాసియా యుద్ధం ప్రపంచంతోపాటు ఇండియాను కూడా తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న సంగతి తెలిసిందే. దేశంలో చమురు కొరత సహా అనేక ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న పరిస్థితులపై మోదీ చర్చిస్తారు. ఎలాంటి పరిస్థితుల్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండటం, తగిన ప్రణాళికలు రూపొందించడం, సరఫరా మార్గాలు, చమురు భద్రత, విదేశాల్లో ఉన్న భారతీయుల రక్షణ వంటి అంశాలపై ప్రధానంగా చర్చిస్తారు. రాష్ట్రాలు, కేంద్రం సమన్వయం, పరస్పర సహకారంతో టీమ్ ఇండియాగా, ఐక్యంగా ఉండాలని మోదీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అత్యవసర పరిస్తితుల్ని ఎదుర్కోవడం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్థానిక స్థిరత్వం సాధించడంపై సమావేశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు సంబంధించి సీఎంలు ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం లేకపోవచ్చని తెలుస్తోంది.




మార్కాపురం బాధితులకు

## ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన

# ప్రధాని మోదీ

న్యూ ఢిల్లీ, మార్చి 26: ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం సమీపంలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్ గ్రేషియా పీఎంఎన్ ఆర్ఎఫ్ నుంచి అందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ మేరకు పీఎంఓ కార్యాలయం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం మండలం రాయవరం సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.




## గత ప్రభుత్వం బకాయిలు

# కడుతున్నాం

- ఆరోగ్యశ్రీ కింద 600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు
- ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించాం
- విద్య,వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం
- సిఎంఆర్ఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారు
- అన్ని బాగోతాలు బయటపెట్టబోతున్నాం
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి26,తెలంగాణ దిశ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరో గ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతు న్నట్లు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాసు పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదలవైద్యం కోసం రూ.4,500కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షా లు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎంరిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నా రు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.



ఇండియాతో సహా ఆ నాలుగు దేశాలకు

# హార్మూజ్‌లో అనుమతి..!

## ప్రకటించిన ఇరాన్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో హార్మూజ్? జలసంధిపై ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. తన మిత్ర దేశాలైన ఇండియా, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి ఐదు దేశాల నౌకల ప్రయాణానికి హార్మూజ్ జలసంధిని అనుమతి ఇస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ప్రకటించారు. ఈ మేరకు ఈ విషయాన్ని ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. కాగా, దేశంలో ఇంధన కొరత ఏర్పడుతోందన్న ఆందోళనలు కొనసాగుతున్న వేళ ఇరాన్ ప్రకటన ఇండియాకు ఎంతో ఉపశమనం కలిగించింది. ఉద్రిక్తతల కారణంగా భారత్‌కు చెందిన నౌకలు రోజుల తరబడి అక్కడే నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే మన నౌకలు సురక్షితంగా హార్మూజ్ దాటేందుకు ఇరాన్ అధికారులతో కేంద్రం నిరంతరం సంప్రదింపులు జరిపింది. ఇప్పుడు ఇరాన్ ప్రకటనతో భారత్‌కు పెట్రోల్, గ్యాస్ సమస్యలు తగ్గే అవకాశం ఉంది.



నన్ను చూసి చాలా మంది

# నవ్వుకున్నారు

## విజయ్ మాల్యా

బెంగుళూరు: ఐపీఎల్ ఫ్రాంచైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టు సుమారు 16600 కోట్లకు అమ్ముడుపోయిన విషయం తెలిసిందే. ఆదిత్య బిర్లా గ్రూపు, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపు, బోల్ట్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్, బీఎక్స్‌పీఈ సంస్థలు కలిసి ఆర్సీబీని సొంతం చేసుకున్నాయి. అయితే ఈ నేపథ్యంలో ఆర్సీబీ ఒరిజినల్ ఓనర్, పరారీలో ఉ న్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా స్పందించారు. ఎక్స్ వేదిక ఆయన కొత్త ఓనర్స్‌కు కంగ్రాట్స్ చెప్పారు. కొత్త జర్నీ ప్రారంభిస్తున్నందుకు బెస్ట్ విషెస్ తెలిపారు. 2008లో ఆర్సీబీని 450 కోట్లకు కొనుగోలు చేశానని, ఆ సమయంలో చాలా మంది నన్ను చూసి నవ్వుకున్నారని, తన పెట్టుబడిని వృధా ప్రాజెక్టు అని విమర్శించినట్లు మాల్యా తన ట్వీట్‌లో తెలిపారు. రాయల్ ఛాలెంజ్ బ్రాండ్‌మీదున్న అభిమానంతో తన ఫ్రాంచైజీకి ఆర్సీబీ అని పేరు పెట్టినట్లు చెప్పారు. 450 కోట్లు పెట్టుబడి పెట్టిన సంస్థ ఇప్పుడు 16 వేల కోట్లకు అమ్ముడుపోవడం చాలా సంతోషాన్నిస్తోందన్నారు.

# ఆరోగ్యశ్రీపై అబద్ధాలు చెప్పే ప్రయత్నం

## మైక్ కట్ చేయడం ద్వారా నిజాలు దాచారు

## మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్,మార్చి26 : రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేం దుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడు తోందన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది.



## ఘోర రోడ్డు ప్రమాదం..

# స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో 13 మంది మృతిచెంద డం, 20 మందికి తీవ్రగాయాలు కావడంపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. నిర్మల్ నుంచి నెల్లూరు వైపు బస్సు వెళుతున్న నేపథ్యంలో మృతిచెందిన, గాయ పడిన వారి వివరాలను తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించా లని ఆజ్ఞాపించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదే శ్ సీఎస్ సాయిప్రసాద్‌తో ఆయన మాట్లాడారు. ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలు సుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంరాయవరంరోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్య మంత్రిరేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



రాహుల్ కంటే..

# ప్రియాంక బెటర్

## విపక్ష నేతపై కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ,: లోక్‌సభలో విపక్ష నేతగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కంటే ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా మెరుగైన ఎంపిక అయి ఉండేవారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీకి ఇంకా రాజకీయ పరిణతి రాలేదని ఆయన విమర్శించారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'టైమ్స్ నౌ సమ్మిట్ 2026'లో మాట్లాడుతూ రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ వ్యవహరించే తీరు, అంశాలను లేవనెత్తే విధానంలో విపక్ష నేతకు ఉండాల్సిన గంభీరత కనిపించడం లేదని రిజిజు అన్నారు. "రాహుల్ గాంధీలో రాజకీయ పరిపక్వత లోపించిందని నేను భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడమే కాకుండా, నిర్మాణాత్మక సూచనలు ఇవ్వడంలో విపక్ష నేత పాత్ర కీలకమని, కానీ రాహుల్ గాంధీలో అది కొరవడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాహుల్‌తో పోలిస్తే ప్రియాంక గాంధీకి రాజకీయాలపై మంచి అవగాహన ఉందని, ప్రజలతో కలిసిపోయే నైపుణ్యం ఆమెకు ఎక్కువగా ఉందని రిజిజు అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఆమె విపక్ష నేతగా ఉండి ఉంటే, సభలో చర్చలు మరింత అర్థవంతంగా సాగి ఉండేవని అన్నారు. అయితే, రిజిజు వ్యాఖ్యల వెనుక రాజకీయ వ్యూహం ఉందని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. రాహుల్ గాంధీ ఇమేజ్‌ను దెబ్బతీయడంతో పాటు, గాంధీ కుటుంబంలో విభేదాలు సృష్టించేందుకే బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ప్రియాంక పేరును తెరపైకి తెస్తున్నారని విమర్శిస్తున్నాయి. మొత్తంగా, విపక్ష నేత విషయంలో రిజిజు చేసిన ఈ పోలిక జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.

## నేడు కుషాయిగూడలో

# శ్రీరామనవమి శోభాయాత్ర



**కుషాయిగూడ, మార్చి 26, (తెలంగాణ దిశ):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కుషాయిగూడలో భక్తి ఉత్సాహం వెల్లివిరుస్తోంది. శ్రీ రామ ఉత్సవ సమితి, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మార్చి 27 శుక్రవారం సాయంత్రం 4 గంటలకు శ్రీరాముల వారి శోభాయాత్రను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శోభాయాత్ర కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద ప్రారంభమై ఈసీఐఎల్, రాధికా, సాకేత్ రోడ్, ఎన్‌టీఆర్ విగ్రహం, జమ్మిగడ్డ ముత్యాలమ్మ దేవాలయం, విఎన్ రెడ్డి కాలనీ, నాగార్జున నగర్ కాలనీ రోడ్ నం.1 మార్గాల గుండా తిరిగికుషాయిగూడ బస్ స్టాప్ వద్ద ముగియనుంది. రాజకీయ పార్టీలకు, కులాలకు అతీతంగా హిందూ సమాజం మొత్తం ఐక్యంగా పాల్గొనాలనే ఉద్దేశంతోఈ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. హిందు సమాజ ఐకమత్యాన్ని చాటేందుకు ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో కలిసి భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా 'గడప లోపల కులం, గడప బయట హిందువులం'అనే సందేశంతో పాటుహిందుత్వం ఒక మతం మాత్రమే కాకుండా జీవన విధానం అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరాముల వారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## కాప్రా కట్ట మైసమ్మ టెంపుల్ లేన్‌లో

# వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపు

### బీజేపీ యువ నాయకుడు విభాకరన్ (బాబీ)కి పలువురి అభినందనలు







**కాప్రా,మార్చి 25, (తెలంగాణ దిశ):** కాప్రా డివిజన్ పరిధిలోని ప్రథమ పురికాలనీ కట్ట మైసమ్మ టెంపుల్ లేన్‌లో పేరుకుపోయిన చెత్త, అక్రమంగా డంప్ చేసిన వ్యర్థాల సమస్యపై బీజేపీ యువ నాయకుడు ఎస్. విభాకరన్ (బాబీ) ఆధ్వర్యంలో గురువారం పరిష్కరించారు. కాప్రా సర్కిల్ శానిటేషన్ విభాగపు సిబ్బంది పర్యవేక్షణలో జెసిబి సహాయంతో చెత్తను తొలగించి వేసి శుభ్రం చేశారు.

ఈ సమస్య పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక అధికారులు హామీ ఇచ్చారు. ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు క్రమబద్ధమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిశీలనలోకి తీసుకుని, సరైన పర్యవేక్షణతో పాటు సమయానుకూల చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మార్గదర్శకత్వంలో, బీజేపీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు శాంతి కిరణ్ నాయకత్వంలో పరిశుభ్రత పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా బీజేపీ యువ నాయకుడు ఎస్. విభాకరన్ (బాబీ) ని పలువురు అభినందించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఆలస్యం చేయకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

## ప్రగతి నగర్ హిందూ సమ్మేళన సమితి ఏర్పాటు

# ఏప్రిల్ 12న హిందూ మహా సమ్మేళనం



**కుత్బుల్లాపూర్, మార్చి 25, (తెలంగాణ దిశ):** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనాల్లో భాగంగా ప్రగతి నగర్‌లో హిందూ మహా సమ్మేళనం నిర్వహించేందుకు స్థానిక హిందువులు "అయోధ్య రామ హిందూ సమ్మేళన సమితి" పేరిట కమిటీని ఏర్పాటు చేశారు. సనాతన హైందవ ధర్మ రక్షణ, హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు హిందూ బంధువుల ఐక్యతే లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పార్టీలు, కులాలకతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో హిందూ బంధువులందరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 12వ తేదీ ఆదివారం సాయంత్రం హిందూ మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశ స్థలం, సమయం తదితర వివరాలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. అయోధ్య రామ హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడిగా పొన్నాల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శిగా గరికపాటి సాంబశివరావు, కోశాధికారిగా నిడసనమెట్ల లక్ష్మీ రామారావు, కార్యనిర్వహణాధికారిగా డాక్టర్ ఎం.ఆర్.ఎస్. రాజు, ముఖ్య సలహాదారుగా ప్రొఫెసర్ చంద్రమౌళి నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా మాదివాడ మోక్షశ్రీ, బేతి రాజా రెడ్డి, రచ్చ చక్రధర్, సురేంద్ర కుమార్ యాదవ్, సహ కార్యదర్శిగా కె.వి. గోపాలకృష్ణంరాజు, సహ కోశాధికారిగా బండి చంద్రశేఖర్, సాంస్కృతిక విభాగ సంయోజకుడిగా యన్నపు లక్ష్మీకాంత్, సహ సంయోజకుడిగా గంపా ప్రభాకర్ తదితరులు ఎంపికయ్యారు. ఈ సమావేశంలో సత్య కాటేపల్లి, శిష్టా రామకిశోర్, అమరనాథ్, గంగాధరరావు, ముప్పల శ్రీనివాసరావు, అరుణ, అమర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ కార్యాలయాల పని వేళలు పొడిగింపు

# మార్చి 31 వరకు ప్రత్యేక ఏర్పాట్లు




**హైదరాబాద్,మార్చి 26, (తెలంగాణ దిశ) :** ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో నమోదుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు అన్ని సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల్లో టైమ్ స్లాట్‌లను పెంచడంతో పాటు పని వేళలను కూడా పొడిగించింది. మార్చి 28, 30 మరియు 31 తేదీలలో కార్యాలయాలు ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు పనిచేయనున్నాయి.

ఇప్పటి వరకు అమలులో ఉన్న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల సమయాన్ని విస్తరించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా రిజిస్ట్రేషన్లకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తుండటంతో, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఈమూడు రోజుల్లో సిబ్బంది ఎటువంటి సెలవులు తీసుకోకుండా పూర్తిస్థాయిలో విధుల్లో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా రిజిస్ట్రార్లు ఉన్నతాధికారులు ఈ మార్పులను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. ఈ నిర్ణయం వల్ల చివరి నిమిషంలో రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి పెద్ద ఊరటనిచ్చే అవకాశం ఉంది.

# విద్యుత్ ప్రమాద బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**రామంతాపూర్, మార్చి 26, (తెలంగాణ దిశ) :** రామంతాపూర్ లో శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో విద్యుత్ ప్రమాదానికి గురైన బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి గురువారం శాసనసభలో కోరారు. ఈ ప్రమాదంలో మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం విధితమే. గత సంవత్సరం ఆగస్టు 17 అర్ధరాత్రి రామంతా పూర్‌లోని ఆర్టీసీ కాలనీ గోకులేనగర్ ప్రాంతంలో కృష్ణుడి రథ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరిం చిన రథం, మార్గమధ్యలో తక్కువ ఎత్తులో వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలను తాకింది. దీంతో రథాన్ని లాగుతున్న వారికి ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలింది. ఈ ఘటనలో కృష్ణ యాదవ్ (21), సురేష్ యాదవ్ (34), శ్రీకాంత్ రెడ్డి (35), రుద్ర వికాస్ (39), రాజేంద్ర రెడ్డి (45) అక్కడికక్కడే మృతి చెందగా, గణేష్ (21) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ ప్రమాదంపై అప్పటిలో ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ దుర్ఘటనకు నిరసనగా రామంతాపూర్‌లోని 68 కాలనీలలో బంద్ పాటించారు. ఇదిలా ఉండగా ప్రమాద బాధితులకు రూ. ఐదు లక్షల చొప్పున ఇచ్చిందే కానీ మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ప్రమాదం జరిగిన సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సంద ర్శించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పట్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నాచారం--హెచ్ఎంటీ నగర్‌లో కాంగ్రెస్


# బైక్ ర్యాలీ, చలివేంద్రం ప్రారంభం



**నాచారం, మార్చి 26, (తెలంగాణ దిశ):** నాచారం సిగ్నల్ నుండి హెచ్ఎంటీ నగర్ వరకు విఎస్. ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొని కార్యక్రమ స్థలానికి చేరుకున్నారు. అనంతరం నాచారం హెచ్ఎంటీ నగర్ లో ఏర్పాటు చేసిన "చలివేంద్రం" ప్రారంభోత్సవ కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాచారం--హెచ్ఎంటీ నగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. తన నాయకత్వంలో ఈ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి జరుగుతోందని చెప్పారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజామద్దతుతో రాబోయే ఎన్నికల్లో ఈ రెండు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే వి.ఎస్. ప్రకాశ్ రెడ్డి చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పేద ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈకార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ గౌడ్, జి.కృష్ణ రెడ్డి, కాప్రా సాయి, మహేష్ యాదవ్, ఎం.శ్రీనివాస్ రెడ్డి, రమేష్, అశ్వత్థామ రెడ్డి, భువన గౌడ్, సునీల్ రెడ్డి, యూసుఫ్, కృష్ణ యాదవ్, నర్సింగ్ రావు, సుధాకర్ రెడ్డి, షరీఫుద్దీన్, ఫిరోజ్, రేవంత్, షాహిద్, పాషా, నరేష్, చి. నరేష్, రఘు,కృపాకర్, రాజేష్, శశి, బాల్‌రాజ్, శ్రీనివాస్ రెడ్డి, ఉమ, సునీత, సుష్మిత, మమత, విజయమ్మ, యాస్మీన్ తదితరులు పాల్గొన్నారు.





# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత

**కుత్బుల్లాపూర్, మార్చి 25, (తెలంగాణ దిశ):** అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీ పత్రాల చెక్కులను కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి గురువారం బాచుపల్లి పార్టీ కార్యాలయంలో అందజేశారు. జిల్లా ఇంచార్జ్‌మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ఈ చెక్కులు మం జూరు అయ్యాయి. ఇందులో భాగంగా దూలపల్లి వాసి దప్పు మేఘనకు రూ. 30 వేలు, జీడిమెట్ల వాసి వీరమల్ల శ్రీరాములకు రూ.60 వేలు, కుత్బుల్లాపూర్ వాసి మన్నెనూర్ సావిత్రికి రూ.41 వేలు, బహుదూర్‌పల్లి వాసి ఆర్. సతీషుకు రూ.55 వేలు, దూలపల్లి వాసి తుడుం రాజ్‌కుమార్‌కు రూ.17,500 విలువైన ఎల్‌ఓసీ పత్రాలను ఆయన లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కొలన్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కష్టపడి పనిచేసే వారికే పదవులు

### మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**కుషాయిగూడ, మార్చి 26, (తెలంగాణ దిశ) :** మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే వారికే పదవులు దక్కుతాయని ఆమె స్పష్టం చేశారు. గురువారం వరంగల్‌లోని ఆమె నివాసంలో మహిళా కాంగ్రెస్ ఉమ్మడి చర్లపల్లి డివిజన్ అధ్యక్షురాలు నరెడ్డి నీరజారెడ్డి మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనురాధతో పాటు ఎర్రబెల్లి స్వర్ణ ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం రాజకీయాల్లో మరింత పెరగాలని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళా కాంగ్రెస్‌ను బలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం క్రమశిక్షణ, అంకితభావం అవసరమని అన్నారు. కష్టపడి పని చేసే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. మహిళల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో మహిళా కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీలింగ్ భూముల పేరుతో ప్రగతి నగర్ వాసులకు నోటీసులు ఇవ్వడం అన్యాయం



**కుత్బుల్లాపూర్, మార్చి 25, (తెలంగాణ దిశ) :** నిజాంపేట సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ వాసులకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి సీలింగ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నారంటూ ఇటీవల నోటీసులు జారీ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రగతి నగర్ ప్రాంతంలోని భూములు సీలింగ్ పరిధిలోకి రావని స్థానికులు పేర్కొంటున్నప్పటికీ, వ్యక్తిగత ఇళ్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు సీలింగ్ భూముల్లో నిర్మించుకున్నారంటూ కలెక్టరేట్ నుండి నోటీసులు అందడం వారిలో ఆందోళనకు గురి చేసింది. ఈ విషయంపై నిజాంపేట్‌కు చెందిన ఆకుల సతీష్ గురువారం బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులకు, మల్కాజిగిరి ఆర్డీవోకు వినతి పత్రాలు సమర్పించారు. సరైన సమాచారం లేకుండానే నోటీసులు జారీ చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రగతి నగర్ వాసులతో కలిసి రెవెన్యూ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# సంపాదకీయం

## యెల్లో మెటల్ ధరల పతనానికి రష్యా మాస్టర్ స్ట్రోక్..

రష్యా తీసుకున్న ఒక కీలక నిర్ణయం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు మదుపర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బంగారం ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. గతేడాది కాలంగా గోల్డ్ ధరలు అంతకంతకూ పెరుగుతూ రికార్డులు క్రియేట్ చేస్తుంది. అటు వెండి సైతం బంగారంతో మించి పైపైకి దూసుకెళ్తుంది. అయితే నిన్నటి వరకు ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పసిడి ధరలు ఇప్పుడు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా భారత్‌లో ఒక సావరిన్ (ఎనిమిది గ్రాముల) బంగారం ధర రూ.1,15,000 మార్కును దాటి.. సామాన్యులకు ఎనిమిదవ వింతలా మారుతుందేమోనన్న ఆందోళన కలిగించింది. అయితే తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు బంగారం ధరల పతనానికి నాంది పలికాయి. జనవరి 29 నుండి బంగారం ధరల్లో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. త్వరలోనే ఇది రూ.1 లక్ష కంటే కిందికి పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు భారత మార్కెట్‌లో బంగారం ధరలు అనూహ్యంగా రూ. 1 లక్ష దిగువకు పడిపోయే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. రష్యా తన బంగారు నిల్వలను భారీగా విక్రయించాలని లేదా మార్కెట్‌లోకి వదలాలని తీసుకున్న నిర్ణయం వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయి ధరలతో ఉన్న పసిడి, ఈ పరిణామంతో సామాన్యులకు కొంత ఊరటనిచ్చే దిశగా సాగుతోంది. కామెక్స్ గోల్డ్ ధరలు త్వరలో ఔన్సుకి 3,000 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రష్యా కదలికల వల్ల డాలర్ ఇండెక్స్‌లో వచ్చే మార్పులు , భౌగోళిక రాజకీయ పరిస్థితులు పసిడి ధరను ప్రభావితం చేయనున్నాయి. సరఫరా, డిమాండ్ మధ్య ఉన్న సమతుల్యత దెబ్బతినడం వల్ల ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు కావడంతో, అంతర్జాతీయ మార్కెట్ మార్పులు నేరుగా ఇక్కడి ధరలపై ప్రభావం చూపుతాయి. రష్యా నుండి వచ్చే సమాచారం నిజమైతే, దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇదే సమయంలో రూపాయి విలువ పతనం వంటి ఇతర అంశాలు కూడా ధరలను నియంత్రించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంగారం ధరలు తగ్గవచ్చనే అంచనాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఒకవైపు ధరల పతనం ఆకర్షణీయంగా కనిపించినా, రష్యా వంటి పెద్ద ఆర్థిక శక్తుల నిర్ణయాలు మార్కెట్‌ను త్వరగా మార్చగలవు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమమని వారు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధరలు అకస్మాత్తుగా తగ్గడానికి ప్రధాన కారణం రష్యా తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయం. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ వాణిజ్యంలో రష్యా తిరిగి అమెరికా డాలర్‌ను ఉపయోగించాలని నిర్ణయించుకుంది. గతంలో డాలర్‌ను బలహీనపరిచేందుకు రష్యా, చైనా వంటి దేశాలు భారీగా బంగారాన్ని నిల్వ చేశాయి. అయితే ఇప్పుడు రష్యా తిరిగి డాలర్ వైపు మొగ్గు చూపడంతో గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ విలువ అనూహ్యంగా పెరుగుతోంది. సాధారణంగా డాలర్ విలువ పెరిగినప్పుడు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి తప్పుకుని డాలర్ వైపు మళ్లుతారు. దీనివల్ల బంగారంపై డిమాండ్ తగ్గి ధరలు పడిపోతాయి.ట్రంప్ విధించిన ఆర్థిక ఆంక్షలను ధిక్కరించేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు ఒక కూటమిగా ఏర్పడి డాలర్‌ను కాదని బంగారాన్ని నిల్వ చేశాయి. కానీ రష్యా ఇప్పుడు తన వైఖరిని మార్చుకుని తిరిగి డాలర్ ఆధారిత ట్రేడింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ప్రపంచ వాణిజ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా బంగారం నిల్వలను మార్కెట్లోకి తెచ్చేలా ప్రేరేపిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. కానీ నిపుణుల అంచనా ప్రకారం.. యుద్ధ వాతావరణం, రాజకీయ అస్థిరత తగ్గడం వల్ల బంగారంపై ఒత్తిడి తగ్గింది. అంతర్జాతీయంగా డాలర్ పుంజుకోవడం వల్ల భారత్‌లో పసిడి ధర లక్ష రూపాయల లోపుకు చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది.బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ, కొనుగోలుదారులు ఒకేసారి భారీగా పెట్టుబడి పెట్టకుండా ధరలు పూర్తిగా స్థిరపడే వరకు వేచి చూడటం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఏది ఏమైనా, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ ధరలు తగ్గుతుండటం భారతీయ కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చే విషయమే. రష్యా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ఆర్థిక మార్పులకు దారితీస్తుందో రానున్న రోజుల్లో చూడాలి.గతేడాది బంగారం ధరలు ఏకంగా 70% మేర పెరిగి రికార్డు స్థాయి రూ. 1.80 లక్షలను తాకాయి. అయితే, అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర ప్రస్తుతం ఉన్న 5,000 డాలర్ల నుండి 3,000 డాలర్లకు పడిపోతే, దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ. 90,000 నుంచి రూ. 1,00,000 మధ్య స్థిరపడొచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# జమ్మిగడ్డ పిహెచ్ సీ (కుషాయిగూడ) ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

## - 384 మందికి ఉచిత పరీక్షలు నిపుణుల ఉచిత వైద్య సేవలు





**కుషాయిగూడ, మార్చి 26, (తెలంగాణ దిశ) :** జమ్మిగడ్డలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా కుషాయిగూడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు ఉచిత వైద్య సిబ్బందికి నిర్వహించారు. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన స్పెషలిస్ట్ వైద్య బృందం పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించింది.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ స్త్రీ ప్రసూతి నిపుణులు డాక్టర్ శివరంజని శ్వేత, డాక్టర్ ఎస్. మానస, డాక్టర్ బి. శ్వేత, డాక్టర్ సమ్రీన్, డాక్టర్ చంద్రప్రియ, డాక్టర్ లలితలు గర్భిణీ స్త్రీలు, మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. అలాగే ఆర్థోపెడిక్ నిపుణులు ఎముకలు, కీళ్ల సమస్యలతో బాధపడు తున్న వారికి వైద్యం అందించగా, పెడియాట్రిషన్లు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. కంటి వైద్యులు చూపు పరీక్షలు నిర్వహించగా, డెంటల్ వైద్యులు పళ్ల సమస్యలపై అవగాహన కల్పించి చికిత్స అందించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ శిబిరం మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. కుషాయిగూడ, జమ్మిగడ్డ, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. మొత్తం 384 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు డాక్టర్ రమాదేవి తెలిపారు. స్థానికంగా నిపుణులైన వైద్యులు అందుబాటులోకి రావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య బృందం సూచించింది.

# ఇంద్రన్న కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభం



**కుత్బుల్లాపూర్, మార్చి 26, (తెలంగాణ దిశ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ విలేజ్‌లోని ఇంద్రన్న కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానికులు నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డికి తెలియజేయగా, ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి మున్సిపల్ నిధుల ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించారు. తాజాగా నిర్మాణం పూర్తికాగా, ప్రారంభోత్సవ కార్యక్రమంలో కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తానని, అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాలనీ ప్రతినిధులు కుంచెల సైదప్ప, కుంచల రాము, సరళ, లక్ష్మన్న, పి. ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, సభావత్ రామచందర్ నాయక్, క్యాంటీన్ నాగరాజు వెంకట్ రెడ్డి, గట్టయ్య, ఆనంద్, మోహన్ రెడ్డి, శ్రీకాంత్ పంతులు, సంపత్ పంతులు, వాసు, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, విష్ణు, రామకృష్ణ, మల్లేష్, రజినీకాంత్, నాని, ప్లంబర్ శీను, మోహన్, శ్రీను, మహేష్, కనకరాజు, వెంకటలక్ష్మి, సత్యవతి, రమణబాబు, రాయుడు, కుంచాల, పాల బిందెల శ్రీనివాస్, శేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.




# బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, మార్చి 25, (తెలంగాణ దిశ):** బాచుపల్లి మండలంలోని నమోదు అయిన ప్రతి ఓటును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) కృషి చేయాలని బాచుపల్లి మండల తహసిల్దార్, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్ఓ) టి. వాణి రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారత ఎన్నికల ప్రధాన అధికారి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమానికి సంబంధించిన ఈ శిక్షణ నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు ప్రక్రియ, ఫారంల స్వీకరణ, ఫీల్డ్ వెరిఫికేషన్, డేటా అప్డేషన్ వంటి అంశాలపై బిఎల్ఓలకు సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే ఎస్ఐఆర్–2026 ద్వారా ఓటరు జాబితాను పూర్తిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టే విధానాన్ని వివరించారు. మాస్టర్ ట్రైనర్లు ప్రాక్టికల్ డెమోస్ ద్వారా బిఎల్ఓలకు మార్గదర్శకాలు అందించారు. తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు కూడా ఇచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి బిఎల్ఓ కచ్చితంగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.



# సైనిక్‌పురిలో టీజీఎస్ పీడీసీఎల్ ఆర్టిజన్ల ధర్నా



**సైనిక్‌పురి, మార్చి 26, (తెలంగాణ దిశ):**
దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్ పీడీసీఎల్)కు చెందిన ఆర్టిజన్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం సైనిక్‌పురి డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం, యాజమాన్యం స్పందించడంలేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిమాండ్లు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ శాఖలోని తొమ్మిది ట్రేడ్ యూనియన్లు కలిసి 'టీవీఏఈ జెఎసి'గా ఏర్పడి ఈ నిరసనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు పలు డిమాండ్లను ముందుంచారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబి నిబంధనలుఅమలు చేయాలని, అన్మ్యాన్ సిబ్బందిని ఆర్టిజన్లుగా మార్చా లని, పీస్‌రేట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, 'ఒకే శాఖ--ఒకే నిబంధన' విధానం అమలు చేయాలని, మిగిలిన కార్మికులందరికీ ఆర్టిజన్ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి టిఆర్ వికెఎస్ రీజినల్ సెక్రటరీ చందు, 327 డివిజన్ అధ్యక్షుడు ఎం.ఎస్. రావు,1104 విభాగం అధ్యక్షుడు కిషోర్ రాజు, ఎస్సీ--ఎస్టీ అసోసియేషన్ నాయకుడు శ్రీనివాస్ తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు. యాజమా న్యం వెంటనే చర్చలకు రావాలని, లేనిపక్షంలో నిరసన లు కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోనాయకులు క్రిస్టోఫర్, ఉపేందర్ రెడ్డి, నరేష్, నవీన్, బాలరాజు,చైతన్య, రమ, మమత, కమల తదితరులు పాల్గొన్నారు.



# రెండుగా పాకిస్తాన్

లాహోరం, : మన పొరుగు దేశం పాకిస్తాన్ మళ్లీ రెండు ముక్కలు కాబో తోందా అంటే అవుననే అంటున్నారు పరిశీలకులు. దశాబ్దాలుగా పాకిస్తాన్ నుంచి విభజన పోరాటం చేస్తున్న బలూచిస్తాన్.. పాకిస్తాన్ నుంచి విడిపోవడం దాదాపు ఖాయం అయినట్లు తెలుస్తోంది. ఇటీవల పాకిస్తాన్ మంత్రి చట్టసభలో మనము.. వాళ్లు అని చెప్పడం 1971 బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు వాడిన పదాలను గుర్తు చేస్తోంది. ఈ పరిణామాలు బలూచ్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 1 నిమిషం 10 సెకన్ల వీడియోలో పాకిస్తాన్ సైనికులు జీమిల్, షమ్సుబ్రేజ్‌లను చూపించింది. వీరిని 7 రోజుల్లో విడుదల చేయకపోతే చంపేస్తామని హెచ్చరించారు. 5 వేల అత్యాధునిక డ్రోన్లతో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌పై దాడులు చేస్తున్నారు. ఇప్పటివరకు 1,184 మంది పాక్ సైనికులు మరణించారు.బలూచిస్తాన్ సీఎం అక్తర్ మెంగల్ 15 రోజుల క్రితం రాజీనామా చేసి, 'ఇక పాకిస్తాన్‌లో ఉండదు' అని ప్రకటించారు. 1947లో ఖాన్ ఆఫ్ కలాట్‌తో ఒప్పందం ఉల్లంఘించి, 1950లో బలూచిస్తాన్‌ను బలవంతంగా కలిపారు. 1958లో నవాబ్ నవరోజ్ ఖాన్ తిరుగుబాటు చేసి అరెస్టు చేయబడ్డాడు. 2006లో నవాబ్ అక్బర్ బుగ్తి హత్యకు దారి తీసింది. ఇలా పాకిస్తాన్ బలూచిస్తాన్‌ను మోసంచేసింది. దీంతో బలూచ్ ప్రజలు పాకిస్తాన్‌ను విశ్వసించడం లేదు. 2002లో చైనా?పాక్ ఆర్థిక మార్గం (సీపీఈసీ) ప్రకటించడం బలూచ్‌లలో కోపాన్ని మేల్కొలిపింది. ఇప్పుడు బీఎల్ఏ ఆపరేషన్ హెరాఫ్ 2.0లో భారత సరిహద్దు యాంటీ?డ్రోన్ టెక్నాలజీతో దాడి చేస్తోంది. భవిష్యత్‌లో పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది.బలూచ్ నాయకులు 'పాకిస్తాన్ ఆక్రమణ' అని పిలుస్తున్నారు. మెంగల్ 'ప్రభుత్వ అధికారం ఏ ఇంచ్ లేకుండా పోయింది' అన్నారు. ఈ ఘటనలు 1971 బంగ్లాదేశ్ సారాంశాన్ని పునరావృతం చేస్తూ, పాక్‌కు కీలక సవాలుగా మారాయి.

# మండల స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో ఆరెంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ




మంథని : మంథని మండలంలో నిర్వహించిన మండల స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పరీక్షకు మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించడం, ప్రతిభావంతులను గుర్తించడం లక్ష్యంగా ఈ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో ఆరెంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) చదువుతున్న తిప్పని ఆకాశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. మొత్తం 50 మార్కులకు గాను 44 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చాడు. ఆకాశ్ సాధించిన విజయంపై పాఠశాల హెచ్ఎం ఈదులపల్లి నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన నేపథ్యంలో ఈ నెల 23న జరగనున్న జిల్లా స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పోటీలకు ఆకాశ్ ఎంపికయ్యాడు. జిల్లా స్థాయి పోటీల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించేలా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు పద్మజ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. పరీక్షలకు అవసరమైన సిలబస్, మోడల్ ప్రశ్నలు, సమస్య పరిష్కార విధానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం నరసింహా రావు ఆకాశ్‌కు గురువారం ఆర్థిక సహాయం అందించి మరింత ప్రోత్సహించారు. విద్యార్థి పట్టుదలతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, సువార్త, గియశోద్దిన్, వోడ్నాల సహేందర్, మమత, శ్రీవాణి, శ్రీలత, సీఆర్‌పీ మల్లన్న, అమన్ పాల్గొన్నారు.

# వేగంగా కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులు


శ్రీకాకుళం, : శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులలో వేగం పెరిగింది. కాశీబుగ్గ పైవంతెన పనులను ఏప్రిల్ నెలకల్లా పూర్తిచేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. అనంతరం పలాస ఆర్వోబీ పనులు, కేంద్రీయ విద్యాలయం పనుల పురోగతిని రామ్మోహన్ నాయుడు పరిశీలించా రు. ఈ వివరాలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు.ఏపీలో కొత్త ఫ్లైఓవర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని వెల్లడించారు. పలాస రైల్వే పైవంతెన, కేంద్రీయ విద్యాలయం పనులు జరుగుతున్న తీరును రామ్మోహన్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రామ్మోహన్ నాయుడు.. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఏళ్లతరబడి సాగుతూ వచ్చాయన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయంలోనూ వచ్చే ఏడాది నుంచి తాత్కాలికంగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.పలాస ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన పలాస ఆర్వోబీ ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉందని.. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా తిరిగి ప్రారంభించామని.. భారతీయ రైల్వే, జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పలాసా ఆర్వోబీ నిర్మాణం పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలకు వీలు కలుగుతుందని వివరించారు.

# థైరాయిడ్.. జీవక్రియల రారాజు



మనిషి శరీరంలో హార్మోన్లను సమతుల్యం చేయడంలో కీలకపాత్ర పోషించేదే థైరాయిడ్ గ్రంథి. ఇది సక్రమంగా పనిచేయకపోతే హార్మోన్లన్నీ అసమతుల్యంగా మారిపోతాయి. దీంతో శరీర భాగాలు సక్రమంగా పనిచేయవు. దీనివల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందువల్ల థైరాయిడ్%ొ% పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రస్తుతం అధిక రక్తపోటు (బీపీ), డయాబెటిస్ వ్యాధుల్లానే థైరాయిడ్ సమస్య కూడా సాధారణంగా మారిపోయింది. ఈ సమస్యకు కచ్చితమైన కారణాలు లేవు. ఒక్కసారి థైరాయిడ్ సమస్య తలెత్తిందంటే జీవిత కాలం మందులు వాడాల్సిందే. వివిధ అనారోగ్యాలకు దారితీసే థైరాయిడ్ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రతి ఏటా మే 25న 'ప్రపంచ థైరాయిడ్ దినం'గా పాటిస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని థైరాయిడ్ సమస్యలు ఎన్ని రకాలు, అవి రావడానికి కారణాలు, వాటి లక్షణాలు, థైరాయిడ్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, అందుబాటులో ఉన్న చికిత్స విధానాల గురించి తప్పకుండా తెలుసుకోవాలి.

%థైరాయిడ్ గ్రంథి మనిషి శరీర జీవక్రియల్లో కీలకపాత్ర పోషిస్తుంది. మెడ భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఉండే ఈ గ్రంథి థైరాయిడ్ హార్మోన్లను విడుదల చేస్తుంది. ఇవి మానవ జీవక్రియల్లో%ొ% అంటే, మనిషి పుట్టిన దగ్గరనుంచి మెదడు అభివృద్ధి, ఎత్తు పెరుగుదల, బాలికల్లో రజస్వల కావడానికి, స్త్రీలలో నెలసరి, గర్భం దాల్చడం వంటి వాటిలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే, థైరాయిడ్ సమస్యలు పురుషులతో పోలిస్తే స్త్రీలలోనే అధికంగా కనిపిస్తాయి. అందువల్లే మహిళలు గర్భధారణకు ముందు తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలి. లేకపోతే తల్లికి థైరాయిడ్ సమస్య ఉంటే పుట్టబోయే బిడ్డలో మెదడు వృద్ధి చెందకపోవచ్చు. సాధారణంగా గర్భం దాల్చిన 11-12 వారాల తర్వాతనే కడుపులో ఉన్న శిశువులో థైరాయిడ్ గ్రంథి ఏర్పడుతుంది. అంటే అప్పటివరకు పిండం అభివృద్ధి తల్లి థైరాయిడ్ గ్రంథిపైనే ఆధారపడి ఉంటుంది. గర్భధారణ సమయంలో తల్లి తీవ్రమైన థైరాయిడ్ సమస్యతో బాధపడుతూ ఉంటే దాని ప్రభావం కడుపులో శిశువు మెదడుపై పడుతుంది. వైద్యులను సంప్రదించాలి థైరాయిడ్ ఉన్న మహిళలు గర్భం దాల్చినప్పుడు వెంటనే ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదించాలి. వాళ్లు సూచించిన ప్రకారం థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలి. ఎందుకంటే గర్భం దాల్చిన థైరాయిడ్ బాధిత గర్భిణులకు థైరాయిడ్ డోస్ వారి ఆరోగ్యస్థితి ఆధారంగా మార్చాల్సి ఉంటుంది.



అంతేకాకుండా వారిని వైద్యులు సాధారణ గర్భిణుల కంటే జాగ్రత్తగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. థైరాయిడ్ లోపంతో అనారోగ్య సమస్యలు: ఎదుగుదల లోపిస్తుంది. బాలికలు రజస్వల కాకపోవడం. పిల్లలు ఎత్తు పెరగకపోవడం. గర్భధారణలో అవరోధాలు.

థైరాయిడ్‌లో రకాలు: ప్రధానంగా థైరాయిడ్‌లో మూడు రకాల రుగ్మతలు ఉంటాయి. 1. హైపో థైరాయిడ్, 2. హైపర్ థైరాయిడ్, 3. థైరాయిడ్ క్యాన్సర్. థైరాయిడ్ సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే రుగ్మతను నియంత్రణలో ఉంచవచ్చు. థైరాయిడ్ సమస్య ఉన్నవారికి ఎలాంటి పథ్యం అవసరం ఉండదు. ఎలాంటి ఆహార నియమాలు పాటించాల్సిన పనిలేదు. అన్నిరకాల ఆహార పదార్థాలు తీసుకోవచ్చు.

1. హైపో థైరాయిడ్: థైరాయిడ్ గ్రంథి నుంచి వెలువడే హార్మోన్ల స్థాయిలు రక్తంలో సాధారణం కంటే తక్కువగా ఉండే పరిస్థితి హైపో థైరాయిడ్ లేదా లో థైరాయిడ్. ఈ సమస్యను రక్త పరీక్ష ద్వారా నిర్ధారిస్తారు.

లక్షణాలు: బరువు పెరగడం. నీరసంగా, డల్‌గా ఉండటం. వెంట్రుకలు రాలిపోవడం. మహిళల్లో నెలసరి సక్రమంగా రాకపోవడం. గర్భధారణ సమస్యలు. మెడ దగ్గర వాపు. పిల్లల్లో హైపో థైరాయిడ్ లక్షణాలు

ఎదుగుదల లేకపోవడం. మెదడులో పరిపక్వత రాకపోవడం. బాలికల్లో రజస్వల సమస్య.

2. హైపర్ థైరాయిడ్: రక్తంలో ఉండాల్సిన మోతాదు కంటే ఎక్కువ స్థాయిలో థైరాయిడ్ హార్మోన్లు ఉండటమే హైపర్ థైరాయిడ్. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే శరీరంలో జీవక్రియలు దెబ్బతిని తీవ్ర అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది.

లక్షణాలు: బరువు పెరిగిపోవడం. ఊబకాయం రావడం.గుండెలో దడ. గుండె వేగంగా కొట్టుకోవడం. ఎక్కువగా ఆకలి వేయడం. కాళ్లు చేతులు వణకడం. వెంట్రుకలు రాలిపోవడం.


స్త్రీలలో నెలసరి సమస్యలు. గర్భధారణ సమస్యలు. అలసట. నీళ్ల విరేచనాలు. సరిగ్గా నిద్ర పట్టదు.

ప్రధాన కారణాలు: ఆటో ఇమ్యూనిటీ అనేది సర్వసాధారణ కారణంగా చెప్పవచ్చు. అంటే మన శరీరం మన కణజాలానికి వ్యతిరేకంగా యాంటిబాడీస్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరు దెబ్బతింటుంది. దానినుంచి విడుదలయ్యే హార్మోన్లలో వ్యత్యాసాలు ఏర్పడతాయి. వీటివల్ల హైపో లేదా హైపర్ థైరాయిడ్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలుంటాయి. అయితే ఈ ఆటో ఇమ్యూనిటీ సమస్య వంశ పారంపర్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. అదికాకుండా ఏదైనా వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కూడా థైరాయిడ్ వచ్చే అవకాశాలు ఉంటాయి. శరీరంలో అయోడిన్ స్థాయిలు తగ్గితే కూడా థైరాయిడ్ సమస్య ఏర్పడుతుంది. థైరాయిడ్ సమస్యలకు వయసుతో సంబంధం లేదు. ఏ వయసు వారికైనా రావచ్చు. కడుపులో ఉన్నప్పుడు శిశువుకు థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పరిపక్వత చెందకపోతే ఆ శిశువుకు పుట్టుకతోనే థైరాయిడ్ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. నవజాత శిశువుల్లో థైరాయిడ్ లక్షణాలు కనిపించవు. కాబట్టి, పుట్టిన వెంటనే శిశువుకు కచ్చితంగా థైరాయిడ్ పరీక్షలు కూడా చేస్తారు.

నిర్ధారణ పద్ధతులు: థైరాయిడ్ సమస్యను రక్తపరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. సాధారణంగా థైరాయిడ్ హార్మోన్లను టీ3, టీ4, టీఎస్‌హెచ్ (థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్)గా పిలుస్తారు. థైరాయిడ్ టెస్టులు చేసినప్పుడు టీ3, టీ4, టీఎస్‌హెచ్ విలువల ఆధారంగానే రోగికి ఏరకమైన థైరాయిడ్ ఉందో నిర్ధారిస్తారు.

టీ3, టీ4 తక్కువగా ఉండి, టీఎస్‌హెచ్ ఎక్కువగా ఉంటే వారికి లో థైరాయిడ్ లేదా హైపో థైరాయిడ్ ఉన్నట్టుగా నిర్ధారిస్తారు. అదే హైపర్ థైరాయిడ్ రోగుల్లో అయితే టీ3, టీ4 ఎక్కువగా ఉండి, టీఎస్‌హెచ్ తక్కువగా ఉంటుంది. థైరాయిడ్ గ్రంథిలో వాపు ఉంటే అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా నిర్ధారిస్తారు.


చికిత్సా విధానం: థైరాయిడ్ స్థాయిలు, వాటికి సంబంధించిన యాంటిబాడీస్ ఆధారంగా చికిత్స చేయాల్సి ఉంటుంది. సాధారణంగా థైరాయిడ్ లక్షణాలు ఉండి, టీఎస్‌హెచ్ స్థాయిలు ఎక్కువగా ఉంటే వెంటనే చికిత్స మొదలుపెట్టాలి. ఒక్కసారి థైరాయిడ్ చికిత్స ప్రారంభిస్తే ఇక జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుంది. హైపో థైరాయిడ్, హైపర్ థైరాయిడ్ రోగులకు చికిత్సా విధానం వేర్వేరుగా ఉంటుంది. లో థైరాయిడ్ రోగులకు 'థైరాక్సిన్' అనే థైరాయిడ్ హార్మోన్ మాత్రలు ఇస్తారు. రోగి రక్తంలోని థైరాయిడ్ విలువల ఆధారంగా మాత్రల డోసు సూచిస్తారు. ఇక హైపర్ థైరాయిడ్ రోగులకు మూడు రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి థైరాయిడ్ మాత్రలు ఇవ్వడం. రెండోది 'రేడియో అయోడిన్ అబ్లేషన్' ఇస్తారు. ఇది చుక్కల మందు రూపంలో ఉంటుంది. ఈ మందు వేయడం వల్ల అధిక పరిమాణంలో ఉన్న థైరాయిడ్ హార్మోన్లు సాధారణ స్థాయికి వస్తాయి. థైరాయిడ్ గ్రంథిలో వాపు వచ్చి పరిమాణం పెరిగినప్పుడు శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. అయితే గ్రంథి పరిమాణం పెద్దగా ఉన్న ప్రతి ఒక్కరికీ సర్జరీ అవసరం ఉండదు. కొంతమందికి మాత్రమే కొన్ని సందర్భాలలో శస్త్రచికిత్స అవసరమవుతుంది.



## సప్లిమెంట్లు.. సపరేటు!

ఈ మధ్యకాలంలో చాలామంది 'సప్లిమెంట్లు' తీసుకుంటున్నారు. ఆహారంతో శరీరానికి తగినన్ని పోషకాలు అందక.. మాత్రలను ఆశ్రయిస్తున్నారు. అయితే, మహిళల వయసును బట్టి.. పోషకాల అవసరాలు వేరు వేరుగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. టీనేజర్లతో పోలిస్తే.. మెనోపాజ్‌కు చేరిన మహిళల శరీర తత్వం వేరుగా ఉంటుందని అంటున్నారు. కాబట్టి, సప్లిమెంట్లు కూడా సపరేటుగా తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. టీనేజీ అమ్మాయిలకు ఐరన్, కాల్షియం ఎక్కువ అవసరం. నెలసరి సమయంలో వీరు రక్తం ఎక్కువగా కోల్పోతారు. కాబట్టి, ఐరన్.. రక్తహీనతను తగ్గిస్తుంది. అదే సమయంలో కాల్షియం.. ఎముకల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

పెళ్లయిన మహిళలకు ఫోలిక్ యాసిడ్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి చాలా అవసరం. ముఖ్యంగా.. గర్భధారణ కోసం న్యూరల్ ట్యూబ్ లోపాల నివారణకు ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా తీసుకోవాలి. ఇక హార్మోన్ల సమతుల్యతకు ఒమేగా-3 సహాయపడుతుంది. కాల్షియం శోషణకు విటమిన్ డి.. సహకరిస్తుంది. రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది. గర్భధారణ సమయంలో ఐరన్, డీహెచ్‌ఏ, ఫోలిక్ యాసిడ్‌తోపాటు అయోడిన్‌తో కూడిన ప్రీనేటల్ మల్టీవిటమిన్లను తీసుకోవడం మంచిది. ఇవి గర్భస్థ శిశువులో మెదడు పెరుగుదలకు తోడ్పడతాయి. ప్రసవ సమస్యలను నివారించడంలో సాయపడతా యి. పెరిమెనోపాజ్, మెనోపాజ్ దశలో ఉన్న మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు రావడం, అలసట పెరగడం వంటి సమస్యలు చుట్టుముడతాయి. ఇలాంటి సమయంలో విటమిన్ బి, డి, కాల్షియం, మెగ్నీషియం చాలా అవసరం. ఇక వృద్ధులు విటమిన్ బి12, డి3తోపాటు కాల్షియం సప్లిమెంట్లు తీసుకోవాలి. ఇవి బోలు ఎముకల వ్యాధిని ఎదుర్కోవడంలో సాయపడతాయి. నాడీవ్యవస్థ ఆరోగ్యానికి హామీ ఇస్తాయి.



## ఈ నట్స్‌ను ఎప్పుడైనా చూశారా..?

### అనేక అద్భుతాలు చేస్తాయి.. విడిచిపెట్టకుండా తినండి..!

నట్స్.. ఈ పేరు చెప్పగానే మనకు బాదం, జీడిపప్పు, వాల్ నట్స్ గుర్తుకు వస్తాయి. కానీ మనకు తెలియని ఇంకా ఎన్నో రకాల నట్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మెకడేమియా నట్స్ కూడా ఒకటి. ఇవి వెన్న రుచిని కలిగి ఉంటాయి. క్రీమ్ లాగా అనిపిస్తాయి. ఎంతో రుచిగా ఉండడమే కాదు అనేక పోషకాలను కూడా అందిస్తాయి. మెకడేమియా నట్స్‌లో క్యాలరీలు, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మెకడేమియా నట్స్‌లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఈ కొవ్వులు మన శరరీంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

ఆర్థరైటిస్ ఉన్నవారికి..: మెకడేమియా నట్స్‌లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది.

హైబీపీ ఉన్నవారికి ఈ నట్స్ మేలు చేస్తాయి. మెకడేమియా నట్స్‌లో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్లేవనాయిడ్స్, టోకోట్రియనోల్స్ జాబితాకు చెందుతాయి.


అలాగే ఈ నట్స్‌లో విటమిన్ ఇ కూడా అధికంగానే ఉంటుంది. ఇవన్నీ శరీరానికి హాని చేసే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల క్యాన్సర్, డయాబెటిస్, నాడీ సంబంధ సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ నట్స్‌లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

మెదడు పనితీరుకు..: మెకడేమియా నట్స్‌లో ఒమెగా 7 తోపాటు ఒమెగా 9 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. దీంతో మతిమరుపు తగ్గుతుంది. చిన్నారులు అయితే చురుగ్గా పనిచేస్తారు. మెదడు యాక్టివ్‌గా మారి చదువుల్లో రాణిస్తారు. తెలివితేటలు పెరుగుతాయి. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలు ఉన్నవారు ఈ నట్స్‌ను తింటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ నట్స్‌ను తినడం వల్ల మూడ్ మారుతుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది.

బరువు తగ్గేందుకు..: అధిక బరువు ఉన్నవారికి ఈ నట్స్‌ను వరం అనే చెప్పవచ్చు. ఈ నట్స్‌లో క్యాలరీలు, కొవ్వులు అధికంగా ఉన్నప్పటికీ ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బరువు తగ్గేలా చేస్తాయి. రోజూ గుప్పెడు మెకడేమియా నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుందని, అధిక బరువు తగ్గుతారని సైంటిస్టులు చేపట్టిన పరిశోధనల్లో తేలింది. ఈ నట్స్ వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడి కొవ్వు కరుగుతుంది. ఫలితంగా బరువు తగ్గి నియంత్రణలో ఉంటుంది. మెకడేమియా నట్స్‌ను తింటే జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల షుగర్ లెవల్స్‌ను సైతం తగ్గించుకోవచ్చు. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా మెకడేమియా నట్స్ వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## ప్రకృతి మనకు అందించిన వరం.. నేరేడు చెట్టు..

### దీని ఆకులతో ఏయే లాభాలు కలుగుతాయంటే..?



ఈ సీజన్‌లో మనకు అధికంగా లభించే పండ్లలో నేరేడు పండ్లు కూడా ఒకటి. గ్రామీణ ప్రాంతాల్లో మనకు ఇవి విరివిగా లభిస్తాయి. చాలా మంది ఇళ్లలో చెట్లు ఉంటాయి కనుక డబ్బు పెట్టకుండానే ఈ పండ్లను తినవచ్చు. నగరాలు, పట్టణాల్లో ఉండేవారు తమకు అందుబాటులో ఉన్న వర్తకుల వద్ద ఈ పండ్లను కొని తినాల్సి ఉంటుంది. అయితే ఈ పండ్లు అందించే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. ఇక నేరేడు పండ్లు మాత్రమే కాదు ఈ చెట్టు ఆకులు కూడా మనకు ఎంతగానో పనిచేస్తాయి. ముఖ్యంగా ఆయుర్వేద ప్రకారం ఈ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి మనకు కలిగే వ్యాధులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. నేరేడు ఆకులతో అనేక రకాల అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

షుగర్ నియంత్రణకు..: డయాబెటిస్ ఉన్నవారికి నేరేడు ఆకులు ఒక వరంగానే చెప్పవచ్చు. నేరేడు ఆకుల్లో జాంబోలైన్, జాంబోసైన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర నెమ్మదిగా విడుదల అయ్యేలా చేస్తాయి. దీంతో షుగర్ కంట్రోల్ అవుతుంది. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. నేరేడు ఆకులను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. నేరేడు ఆకుల నుంచి రసం తీసి పావు టీస్పూన్ మోతాదులో భోజనానికి ముందు సేవించవచ్చు. లేదా ఈ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు 2 సార్లు భోజనానికి 30 నిమిషాల ముందు ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి. ఇలా చేస్తుంటే డయాబెటిస్ అదుపులో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

జీర్ణ సమస్యలకు..: నేరేడు ఆకుల్లో ఉండే సమ్మేళనాలు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. నేరేడు ఆకులతో తయారు చేసిన నీళ్లను తాగితే విరేచనాల నుంచి బయట పడవచ్చు. పేగుల్లో మలం సరిగ్గా కదులుతుంది. మలబద్ధకం సైతం తగ్గుతుంది. నేరేడు ఆకుల నీళ్లను తాగడం వల్ల జీర్ణాశయంలో పలు ఎంజైమ్‌లతోపాటు బయో యాక్టివ్ సమ్మేళనాలు ఉత్పత్తి అవుతాయి. ఇవి కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి, అసిడిటీ వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. నేరేడు ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నోరును ఆరోగ్యంగా ఉంచుతాయి. నేరేడు ఆకులను నేరుగా నమిలి తింటుండాలి. దీంతో నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి.

ఆర్థరైటిస్ నొప్పులకు..: నేరేడు ఆకుల్లో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్స్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా కూడా పనిచేస్తాయి. అందువల్ల ఈ ఆకులతో తయారు చేసిన నీళ్లను తాగుతున్నా లేదా ఈ ఆకుల పేస్ట్‌ను వేసి కట్టు కడుతున్నా ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వాపులు కూడా తగ్గుతాయి.

అలాగే నేరేడు ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. నేరేడు ఆకుల నీళ్లను రోజూ తాగడం వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. ఇలా నేరేడు పండ్లు మాత్రమే కాదు, నేరేడు చెట్టు ఆకులు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి.

# ఏళ్లుగా రిపేర్ లేని రోడ్డు!

పూణె: మన భారతదేశంలో కొన్ని ప్రయాణాలు చేసేటప్పుడు గతుకుల రోడ్లు.. డ్యామేజ్ అయినా రహదారులు కనిపిస్తూ ఉంటాయి. అయితే కొత్తగా వేసిన రోడ్డు సైతం కొన్ని రోజుల తర్వాత వెంటనే గుంతలు పడడం లేదా డ్యామేజ్ అవ్వడం జరుగుతుంది. కానీ పూణే లోని ఓ రోడ్డు 48 సంవత్సరాల కిందట వేయగా.. ఇప్పటి వరకు ఆ రోడ్డు చెక్కుచెదరకుండా ఉంది. అంతేకాకుండా 2.5 కిలోమీటర్ల వరకు ఒక్క గుంత కూడా కనిపించదు. అసలు విషయం ఏంటంటే ఈ రోడ్డు నిర్మించే ముందే కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి ఒక సవాలు విసిరారు. 10 సంవత్సరాల వరకు ఈరోడ్డుపై ఒక్క గుంతఉన్న కూడా తిరిగి రోడ్డు మొత్తం వేస్తామని అన్నారు.. కానీ48 సంవత్సరాల వరకు ఆ రోడ్డు నాణ్యతతో ఉంది. ఇంతకీ ఆరోడ్డు పూణేలో ఎక్కడ ఉంది? దీనిని నిర్మించింది ఎవరు? ఆ తర్వాత వీరికి జరిగిన నష్టం ఏంటిపూణేలోని జంగ్లీ మహారాజ్ రోడ్..దీనినే ప్రస్తుతం ఏఓరోడ్డు అని పిలుస్తున్నారు. శివాజీ నగర్ నుంచి దక్కన్ జింఖానా వరకు 2.5 కిలోమీటర్ల వరకు 6రోడ్డు కనిపిస్తుంది. దీనిని 1976 జనవరి లో ప్రారంభించారు. 1972లో మహారాష్ట్రలో కరువు, మరదల కార ణంగా పూణేలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో కొందరు రాజకీయ నాయకులుమాట్లాడుతూ ముంబైలోని రోడ్లు ఎన్నో వరదలు వచ్చినా కూడా తట్టుకొని ఎందుకు ఉంటు న్నాయి? అన్న ప్రశ్నలు లేవనెత్తారు. దీంతో ముంబైకి చెందిన రెకాండో అనే సంస్థ హార్ట్ మిక్స్ హాట్ ఎతిలీ అనే టెక్నాలజీతో రోడ్లను నిర్మిస్తుందని కొందరు చెప్పారు. ఈ రికనీడో సంస్థను పార్శి సోదరులు నడిపేవారు. ఈ విషయం తెలుసుకున్న పూణేలోని కార్పొరేటర్ శ్రీకాంత్ శిలోరే పట్టుదలతో పార్శ బ్రదర్స్ కు శివాజీ నగర్ రోడ్డు కాంటాక్ట్ గా అప్పగించారు. అయితే వారు కాంటాక్ట్ లో పేర్కొన్న ప్రకారం.. 10 సంవత్సరాల వరకు రోడ్డు నాణ్యత దెబ్బతింటే తిరిగి పూర్తిగా నిర్మిస్తామని సవాల్ విసిరారు. వీరుఈరోడ్డు నిర్మించే సమయంలో నాణ్యతను ఉపయోగించిహాట్ ఎతిలీ టెక్నాలజీని ఉపయోగించారు. భవిష్యత్తులో కేబుల్స్,తుఫాను వంటి నీటి కాలువల కోసం రోడ్డు అంచున ప్రత్యేకంగా డక్టులను ఏర్పాటు చేశారు.ఈ విధంగా వారు వేసిన రోడ్డు 48 సంవత్సరాల వరకు నాణ్యతతో కూడుకొని ఉంది. ఇప్పటివరకు ఈరోడ్డుపై ఎక్కడ గుంత ఏర్పడలేదు. 2010లో స్వల్ప మరమ్మతులు మినహా రోడ్డుకు నిర్వహణ ఖర్చులు ఎక్కడ అవసరం పడలేదు. అయితే దురదృష్టం ఏంటంటే ఈ ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత రికండో కంపెనీకి మళ్లీ కొత్త ప్రాజెక్టు రాలేదు. పార్శ బ్రదర్స్ వయసు ఎక్కువగా కారణంగా వారు మరో ప్రాజెక్టు చేపట్టలేదు అన్న ప్రచారం ఉంది. ఇటీవల వేసిన చాలా రోడ్లు, బ్రిడ్జిలు ఏడాది తిరగకముందే నాణ్యతను దెబ్బతింటున్నాయి. అలాంటి వారికి ఈ ఏఓ రోడ్డు స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు.

# బార్ల వైపు చూడని జనం..!

**గుంటూరు,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ లో కొత్త బార్ల పాలసీకి స్పందన కొరవడింది. ఆశించిన రీతిలో దరఖాస్తులు అందకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికా రులు ఆందోళన చెందుతున్నారు. లైసెన్సు ఫీజు భారీగా తగ్గించినప్పటికీ దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడానికి కారణాలపై ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నారు. నిజానికి ఏపీలో బార్ల లైసెన్స్ ల కోసం ఎప్పుడూ ఎగబడతారు. బార్లకు సమయం కూడా ప్రభుత్వం పెంచడంతో గిరాకీ పెరిగే అవకాశముంది. అత్యధిక లాభాలను ఆర్జించే అవకాశాలున్నాయి. అయినా సరే ఎందుకో గాని ఈసారి బార్ల లైసెన్సుల కోసం దరఖాస్తులు అతి తక్కువ రావడంతో దీనిపై ఎక్సైజ్ అధికారులు కింది స్థాయి అధికారులతో మాట్లాడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 840బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈరోజుతో దరఖాస్తు గడువు ముగియనుంది. అయితే ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులు కేవలం తొంభయి మాత్రమేనని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇంత తక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ వేయడం కూడా కష్టమేనని ఎక్సైజ్ శాఖ అధికా రులు భావిస్తున్నారు. మద్యం వ్యాపారులు ఎక్కువ మంది ఉత్సాహం చూపడానికి గల కారణాలను అన్వేషించడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఉన్నారు. నిజంగా ఇది ఆశ్చర్యానికి గురి చేస్తుందంటున్నారు. దీనికి ప్రధాన కారణం అధికార పార్టీ ఎమ్మెల్యేల వత్తిడి కూడా కొంత ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. అదే సమయంలో ఎనిమిది జిల్లాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆందోళనలో ఉన్నారు. అనంతపురం, కోనసీమ, అనకాపల్లి, తూర్పు గోదావరి, నెల్లూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గుంటూరు, ప్రకాశం,విజయవాడ వంటి ప్రాంతాల్లోనూ తక్కువ దరఖాస్తులు వచ్చాయంటున్నారు. అయితే బెల్ట్ షాపులు పెరిగిపోవడంతో పాటు వైన్ షాపులనే మినీ బార్లుగా మలచి వ్యాపారాలను నిర్వహిస్తుండటంతో తాము బార్లకు లైసెన్సు ఫీజు చెల్లించి అనుమతులు పొందినా గిరాకీ రావడం కష్టమేనని భావించి వెనక్కు తగ్గి ఉంటారని అనుమానిస్తున్నారు.




మరొకవైపు వ్యాపారులు సిండికేట్ అయ్యారన్న సందేహాలు కూడా ఉన్నాయి.ఎక్సైజ్ శాఖ తీసుకువచ్చిన కొత్త విధానం తమకు అనుకూలంగా లేదనీ.. దానివల్ల తమకు గిట్టుబాటు కాదని వ్యాపారులు ఆసక్తి చూపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతీ బార్‌కు కనీసం 4దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామనే రూల్ పెట్టడం తో.. అదనపు ఏఆర్ఈటీ 15 శాతాన్ని తొలగించకపోవడం కూడా వ్యాపారులు లైసెన్స్‌లకు అప్లై చేసుకోకపోవడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. మరోవైపు.. ఇప్పటికే ఏపీలో మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకునేం దుకు ఇటీవలె ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అంతేకాకుండా రూ.99కిదొరికే క్వార్టర్ మద్యాన్ని బార్‌లలో అమ్మడానికి వీలులేదనే నిబంధన కూడా తీసుకువచ్చింది.ఎన్టీఆర్ జిల్లాలో130 బార్‌లు ఉండగా.. కేవలం 10 బార్‌లకే దరఖాస్తులు వచ్చాయి. గుం టూరు జిల్లాలో 110కి గానూ బార్‌లకు మాత్రమే 4 లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. కర్నూలు జిల్లాలో 2బార్‌లకు 6 బార్లకు మాత్రమే 4 లేదా అంతకుమించి అప్లికేషన్లు వచ్చాయి.మొత్తం 3,332 మంది రూ.10వేలు ప్రాసెసింగ్‌ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారనీ.. ఈ నెల 30వ తేదీన ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీసే ప్రక్రియ మొదలు అవుతుందని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్ కుమార్ వెల్లడించారు.

# అందరూ మిత్రులే...

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏ రాష్ట్రంలోనైనా ప్రాంతీయ పార్టీలు ప్రత్యర్థులుగా ఉంటూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని ఒకరు మద్దతిస్తే, మరొకరు వ్యతిరే కిస్తారు. కానీ ఏపీ రాజకీయాల తీరు వేరు. 2014 లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ఇక్కడ ప్రధాన ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు కేంద్రంలో ఉండే బీజేపీ వైపు నిలుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో టీడీపీనేరుగా బీజేపీతో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ంది. అదే సమయంలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ కూడా కేంద్రంలో ఉన్నబీజేపీకి అనేక సందర్భాల్లో మద్దతుగా నిలిచింది. ఇక నాడు ప్రారం భమయిన దోస్తీనేటి వరకూ కొనసాగుతూనే ఉంది. 2014లో కేంద్రం లో, రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీలు తర్వాత విభేదాలతో విడిపోయాయి. ఎన్డీఏ నుంచి రావడంతో నాడు బీజేపీని వ్యతిరేకి ంచిన చంద్రబాబు దాదాపు ఐదేళ్లు ఢిల్లీకి వెళ్లలేదు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ పట్ల టీడీపీ సాఫ్ట్ కార్నర్ గావ్యవరిస్తూ వచ్చింది. అంతేకాదు టీడీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు నలుగురు బీజేపీలోకి వెళ్లిపోయారు. ఇక అప్పటి నుంచి నాడు అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మద్దతిస్తూ వస్తుంది. 2018 లో జరిగిన ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్న టీడీపీ చివరకు 2019 లో ఫలితాల తర్వాత మాత్రం తిరిగి బీజేపీకి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది.

# బొండాకు ఫ్రస్టేషన్ ఎందుకు

**విజయవాడ,తెలంగాణ దిశ :** టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జనసేన అంటే పడటం లేదా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేయడాన్ని అనేక కోణాల్లో విశ్లేషణలు వెలువడుతున్నాయి. బొండా ఉమామహేశ్వరరావు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆయన ఈసారి మంత్రి పదవిని ఆశించారు. కానీ జనసేనతో పాటు టీడీపీలో ఉన్న కాపు సామాజికవర్గం నేతలకు ఎక్కువ మంత్రి పదవులు ఇవ్వాల్సి రావడంతో బొండా ఉమామహేశ్వరరావుకు తాను ఆశించినట్లు మంత్రి పదవి దక్కలేదు. భవిష్యత్ లోనూ దక్కుతుందన్న గ్యారంటీ మాత్రం కనిపించడం లేదు సామాజికవర్గం.. జిల్లా కోటాలో... ఎందుకంటే బొండా ఉమామహేశ్వరరావు కాపు సామాజికవర్గం కావడంతో పాటు కృష్ణా జిల్లా కావడంతో జిల్లా కోటాలో, సామాజికవర్గం కోటాలో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు భవిష్యత్ లో లేవన్నది అంచనా. ఎందుకంటే పొంగూరు నారాయణకు ఖచ్చితంగా కేబినెట్ లో కీలకంగా ఉంటారు. అదే సమయంలో కృష్ణా జిల్లా నుంచి ఇతర సామాజికవర్గానికి చెందిన నేతలకు మాత్రమే మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే జనసేన వల్లనే తనకు మంత్రి పదవి దక్కలేదన్న అక్కసు ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది. టీడీపీలో ఒక సంప్రదాయం ఉంది. ఏ సామాజికవర్గం వారిని ఆ సామాజికవర్గం వారి చేతనే విమర్శలు చేయిస్తారు. అలాడే టీడీపీ అధినాయకత్వం ఆదేశాల మేరకు అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారా లేక ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయమా అన్నది తేలాల్సి ఉంది.కాలుష్య నియంత్రణ మండలి విభాగానని కూడా చూస్తున్న పవన్ కల్యాణ్ ను నేరుగా విమర్శించకపోయినా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిత్వ శాఖపై విమర్శలు చేయడంతో జనసైనికులు మండిపడుతున్నారు. గతంలో అంటే 2019 లో కాపు సామాజికవర్గం టీడీపీ నేతగా బొండా ఉమామహేశ్వరరావు పవన్ కల్యాణ్ పై చేసిన విమర్శలను ఈ సందర్భంగా జనసైనికులు గుర్తు చేస్తున్నారు. అయితే దీనిపై పవన్ కల్యాణ్ కూడా ఒకింత సీరియస్ గానే ఉన్నట్లు కనపడుతుంది. ఈ విషయంలో ఆయన పర్యావరణ శాఖ అధికారుల నుంచి పూర్తి వివరాలను ఇప్పటికే తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దీనిపై ఒక రిపోర్టు ఇవ్వడానికి ఆయన సిద్ధమవుతున్నట్లు కనపడుతున్నారని అంటున్నారు. బొండా ఉమామహేశ్వరరావు తన నియోజకవర్గం పరిధిలో ఒక కంపెనీపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేయడమే కాకుండా, న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారని చెబుతున్నారు. కాలుష్యం వెదజల్లుతున్న ఆ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలిని బొండా ఉమామహేశ్వరరా వు కోరారంటున్నారు. వెంటనే అధికారులు ఆ కంపెనీకి నోటీసులు ఇవ్వడమే కాకుండా చర్యలకు కూడా సిద్ధమవుతున్న సమయంలో తిరిగి ఫిర్యాదు చేసిన బొండా ఉమామహేశ్వరరావు చర్యలు తీసుకోవద్దని కోరినట్లు పవన్ కల్యాణ్ కు ఇచ్చిన నివేదికలో అధికారులు తెలిపినట్లు సమాచారం. అంటే ఇక్కడ ఏదో జరిగిందని పవన్ కల్యాణ్ కూడా అనుమానిస్తూ దీనిపై చంద్రబాబు వద్ద పంచాయతీ పెట్టాలని నిర్ణయించుకున్నారని సమాచారం. అయితే టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తాను లేవనెత్తిన ప్రశ్నలకు వెంటనే రియాక్ట్ అయ్యారని, వేగంగా స్పందించారని ట్వీట్ చేయడం చూస్తుంటే .. నాయకత్వం తలంటినట్లే కనిపిస్తుంది.

# మరో కొత్త ఆర్వోబీ..!

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వేగం పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పలు జాతీయ రహదారుల నిర్మాణాలు, రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మరో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆమోదం లభించింది. విజయవాడ వాంబేకాలనీ వాసుల చిరకాల కోరికను నెరవేరుస్తూ వాంబే కాలనీ– మధురానగర్ మధ్యన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వాంబే కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు ప్రాజెక్టులలో కదలిక వస్తోంది. ఈ క్రమంలోనే విజయవాడ ఈ కాలనీలో నివసించేపేదలు, కూలీల కల ఎట్టకేలకు నెరవేరనుంది. మధురానగర్ – వాంబేకాలనీ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి సంబంధించి అడుగులు పడనున్నా యి.అజిత్ సింగ్ నగర్, వాంబేకాలనీలలో నివసించే కూలీలు, నిరుపేదలు పనుల కోసం విజయవాడ నగరంలోకి రావాలంటే అవస్థ లు పడాల్సి వస్తోంది. సుమారు 50 వేల మంది కూలీలు, కార్మికులు విజయవాడలోకి రావాలంటే వాంబేకాలనీ– దేవీనగర్ మధ్య ఉన్న రైల్వేట్రాక్‌నుదాటాల్సి వస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నిత్యం ఈ రైల్వేట్రాక్ దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ–విశాఖ రైల్వేలైన్ దాటి దేవీనగర్, మధురానగర్ మీదుగా నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ట్రాక్ సుమారుగా పది అడుగుల ఎత్తు ఉండటంతో మహిళలు, చిన్నారులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పలుసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి.దీంతో ఈసమస్యను పరిష్కరించాలని, రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఈ అంశం మీద రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ కూడా రాశారు. ఈ లేఖపై స్పందించిన రైల్వే మంత్రి.. వాంబే కాలనీ– మధురానగర్ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్నికి లేఖ ద్వారా సమాచారం అందించా రు.లిమిటెడ్ హైట్ సబ్ వే ( రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి సంబం ధించిన డిజైన్, డ్రాయింగ్ పనులు ప్రారంభించామని.. లేఖలో వివరిం చారుఈ నిర్మాణం పూర్తి అయితే అజిత్ సింగ్ నగర్ ఫ్లైఓవర్ మీద భారం తగ్గుతుంది. అలాగే వేలాది మందికి ప్రయోజనం చేకూరనుం ది. మరోవైపు చిరకాల స్వప్నమైన రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో వాంబే కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

# ఏఐతో ఉద్యోగాల తొలగింపు..

## సీనియర్లను పక్కనపెట్టి జూనియర్లతో పని.. వైరల్ అవుతున్న రెడిట్ పోస్ట్!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయనే భయాలు నిజమవుతున్నాయి. ఖర్చులు తగ్గించుకునేందుకు, లాభాలు పెంచుకునేందుకు కంపెనీలు ఏఐని వేగంగా అందిపుచ్చుకుంటున్నాయి.ఈ క్రమంలో ఉద్యోగుల తొలగింపు పర్వం ఇప్పటికే మొదలైందని చాటిచెబుతున్న ఓ రెడిట్ పోస్ట్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 'ఇండియన్ వర్క్‌ప్లేస్' అనే రెడిట్ గ్రూపులో "ఏఐరీప్లేస్‌మెంట్ ఈజ్ రియల్" (ఏఐతో తొలగింపు నిజం) అనే పేరుతో ఓయూజర్ పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. తన కంపెనీలో సీనియర్,మధ్యస్థాయి ఉద్యోగులను తొలగించి,వారి స్థానంలో కేవలంఅనుభవం లేని అసోసియేట్లు, ఇంటర్న్‌లను మాత్రమే ని యమించుకోవాలని తమ సీఈఓ భావిస్తున్నారని ఆ యూజర్ పేర్కొన్నారు. ఇందుకోసం ఏకంగా 15 నుంచి 20 ఏఐ టూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ అభివృద్ధి చేసిన ఏఐ టూల్‌ను వాడటం లేదనే కారణంతో, అవార్డులు గెలుచుకున్న ఓ టాప్ పెర్ఫార్మర్‌పై సీఈఓ దాదాపు రెండు గంటల పాటు ఒత్తిడి చేశారని ఆ పోస్టులో వెల్లడించారు. ఇప్పటికే కంపెనీలోని చాలా మందిటీమ్ లీడ్స్,ఆర్కిటెక్టులను తొలగించారని, ఇక అంతా ముగి సిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో, నెటిజన్లు భిన్నరకాలుగా స్పందిస్తున్నారు. ఏఐ మోజులో పడి కంపెనీలు ఉద్యోగులను తొలగించడం సరైన పద్ధతి కాదని, ఇది భవిష్యత్తులో తిప్పికొడుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు. "ఏఐ రాసిన కోడ్‌ను అర్థం చేసుకోవడానికి, దాన్ని సరిచేయడానికి మళ్లీ నిపుణులైన టెకీలు అవసరమవుతారు" అని ఒకరు కామెంట్ చేయ గా, "కొన్నేళ్ల తర్వాత జూనియర్లు, ఏఐ కలిసి సృష్టించిన అయోమ యాన్నిసరిచేయడానికి మళ్లీ సీనియర్లనే నియమించుకోవాల్సి వస్తుం ది" అని మరొకరు అభిప్రాయపడ్డారు. మంచి డ్రైవర్ లేకపోతే రేసు కారుతో పరుగుపందెం గెలవలేమని, అలాగే నిపుణుడైన డెవలపర్ లేకుండా ఏఐతో గొప్ప ఉత్పత్తులను సృష్టించడం అసాధ్యమని ఇంకొందరు పేర్కొన్నారు.కాగా, గత వారం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ కూడా ప్రస్తుత ఏఐ క్రేజ్‌ను ఒక 'పారిశ్రామిక బబుల్' (పారిశ్రామిక బుడగ)గా అభివర్ణించడం గమనార్హం.

# మార్కెట్‌కు హెచ్-1బీ సెగ!

## ఐటీ, స్థిరాస్తి రంగాల్లో అమ్మకాల ఒత్తిడి!

ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లను హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నిర్ణయం గట్టిగానే ప్రభావితం చేయవచ్చనిపిస్తున్నది. ముఖ్యంగా భారతీయ ఐటీ రంగ సంస్థల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవచ్చని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో లాభాల స్వీకరణకు ఆస్కారం ఉందనే చెప్పవచ్చు. నిజానికి సూచీల అప్‌ట్రెండ్‌కు గతవారం చివరి రోజునే బ్రేకులుపడ్డాయి. మదుపరులు అమ్మకాలకే పెద్దపీట వేశారు. అయినప్పటికీ అంతకు ముందు వారం ముగింపుతో చూస్తే గత వారంలోనూ సూచీలు పుంజుకున్నాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 721.53 పాయింట్లు పెరిగి 82,626.23 వద్ద ముగిసి ంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 213.05 పాయింట్లు కోలుకుని 25,327.05 దగ్గర నిలిచింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసాల నిర్ణయంతో ఈ వారం మార్కెట్లపై సెల్లింగ్ ప్రెషర్ ఉండవచ్చన్న అంచనాలైతే వినిపిస్తున్నాయి. ఇక ఎప్పట్లాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు,





ముడి చమురు ధరలు, అంతర్జా తీయ పరిణామాలు ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,600–25,800 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కష్టాలు

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు సుప్రీం కోర్టు విధించిన గడువు సమీపిస్తోంది. దీంతో స్పీకర్ గడ్డం పసాద్‌కుమార్ వేగంగా ప్రక్రియ చేపడుతున్నారు. తాజా చర్యలు అనూహ్యమైన మలుపును తీసుకొచ్చాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలపై డిఫెక్షన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్పీకర్ జారీ చేసిన అదనపు నోటీసులు విచారణ ప్రక్రియను వేగవంతం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చలకు దారితీశాయి.2024లో బీఆర్ఎస్‌లోని పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఫిరాయింపు వివాదం మొదలైంది. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి (బంస్వాడ), కల్యాయాదయ్య (చేవెల్ల), ఎం. సంజయ్ కుమార్ (జగిత్యాల), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గుడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), టి. ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికేపుడి గాంధీ (సేరిలింగంపల్లి), దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట రావు (భద్రాచలం) బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచినా పార్టీ మారారు. బీఆర్ఎస్ నేతలు ఈ మార్పును ఫిరాయింపుగా భావించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఎటూ తేల్చకపోవడంతో గులాబీ నేతలు హైకోర్టు తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు జూలై 31, 2025 నాటి తీర్పులో స్పీకర్‌కు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించడంతో ప్రక్రియ వేగపడింది. ఫిబ్రవరి 2025లో మొదటి నోటీసులు జారీ అయినప్పటికీ, ఎమ్మెల్యేలు తమకు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, పార్టీ మారలేదని సమాధానాలు ఇచ్చారు. ఈ సమాధానాలు బీఆర్ఎస్ నేతలకు పంపబడిన తర్వాత, ఆ పార్టీ తరఫున జగదీశ్ రెడ్డి, కేపీ వివేకానంద, చింతా ప్రభాకర్ వంటి నేతలు రీజాయిండర్లు సమర్పించారు.ఆగస్టు 2025 చివరిలో స్పీకర్ అదనపు నోటీసులు జారీ చేసి, మరిన్ని ఆధారాలు సమర్పించమని ఆరుగురు ఎమ్మెల్యేలు సంజయ్, పోచారం, కలెయాదయ్య, తెల్లం వెంకట రావు, కృష్ణమోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డిని ఆదేశించారు. ఈ నోటీసులు డిఫెక్షన్ చట్టం (10వ షెడ్యూల్) ప్రకారం విచారణను లోతుగా చేయడానికి ఉద్దేశించబడ్డాయి. స్పీకర్ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవేత్తల సలహాలతో ఈ చర్య తీసుకున్నారు, ఎందుకంటే మొదటి సమాధానాలు బీఆర్ఎస్ ఫిర్యాదులకు సంతృప్తి చెయ్యలేదు. ఈ అనూహ్య చర్య రెండు కారణాల వల్ల ఆసక్తికరంగా మారింది. ఒకటి, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న ఫొటోలు, విజ్ఞప్తులు వంటి ఆధారాలు.


# అంతా జెనీమయం!




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మీరు ఏది కోరుకుంటే దాన్ని నెరవేర్చే 'అల్లావుద్దీన్ అద్భుత దీపం' గురించి వినే ఉంటారు కదా? ఇప్పుడు టెక్ ప్రపంచం లో అలాంటి ఓ మ్యాజిక్‌నే నిజం చేయబోతున్నది గూగుల్. అవును.. సుందర్ పిచాయ్ఇటీవల ప్రకటించిన'ప్రాజెక్ట్ జెనీ' ఇప్పుడు ఇంటర్నెట్ లోకంలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. 'ఇది ఈ లోకానికి చెందని టెక్నాలజీ' అని గూగుల్ సీఈవో వర్ణించారంటే.. మనం ఊహించే ఏఐ కంటే ఇది ఎన్నిరెట్లు పవర్‌ఫుల్‌గాఉండబోతున్నదో అర్థం చేసుకో వచ్చు. అసిస్టెంట్ నుంచి అడ్వైజర్ వరకు.. మీ ప్రతి అవసరాన్ని ముందే పసిగట్టేస్తుందట ఈ సరికొత్త 'డిజిటల్ జెనీ'. ఇప్పటివరకూ చూసిన చాట్‌బాట్లు మనం అడిగిన దానికి మాత్రమే సమాధానం ఇస్తాయి. కానీ 'ప్రాజెక్ట్ జెనీ' అలా కాదు. ఇది మీ అవసరాలను, మీ ఆలోచనలను ముందే పసిగట్టే.. ఓ 'ప్రోయాక్టివ్ ఏఐ'. మల్టీ-మోడల్ పవర్: ఇది కేవలం టెక్స్ట్ మాత్రమే కాదు.. మీరు చూస్తున్నది, వింటున్నది.. అంతేకాదు.. మీ చుట్టూ ఉండే పరిసరాలను కూడా అర్థం చేసుకుంటుంది. మీరు ఏదైనా పనిలో ఇబ్బంది పడుతుంటే.. మీరు అడగకముందే 'నేను సహాయం చేయనా?' అని అడుగుతుంది. అందుకే దీన్ని గూగుల్ తన అత్యంత శక్తిమంతమైన ఏఐ మోడల్‌గా పేర్కొంటున్నది. సుందర్ పిచాయ్ దీన్ని అంతలా పొగడటానికీ ఓ కారణం ఉంది. ఇది కేవలం సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు. మన దైనందిన జీవితంలో ఓ భాగం కాబోతున్నది. మనిషికి, యంత్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించే ఓ అద్భుత వంతెన ఇది. మనిషి టెక్నాలజీని వాడే విధానాన్నే పూర్తిగా మార్చేయబోతున్నది. మీ ఫోన్, ల్యాప్‌టాప్, చివరికి మీ ఇంటి స్మార్ట్ డివైజ్‌లతో అనుసంధానమై.. ఓ అదృశ్య నేస్తంలా మీకు తోడుగా ఉంటుంది. మీరు బిజీగా ఉన్నప్పుడు మీ మెయిల్స్ షెడ్యూల్ చేయడం మొదలుకొని, మీ మూడ్‌ను బట్టి మ్యూజిక్ ప్లే చేయడం వరకూ అన్నీ ఈ 'జెనీ'నే చూసుకుంటుంది.

ఏఐ రేసులో గూగుల్ మార్క్!: ఏఐలో మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఏఐ వంటి దిగ్గజాలు పోటీ పడుతున్న తరుణంలో.. 'ప్రాజెక్ట్ జెనీ'తో గూగుల్ తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని చూస్తున్నది. ఇందులో వాడిన అల్గారి థమ్స్ మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత వేగంగా డేటాను ప్రాసెస్ చేస్తాయి. కేవలం ఇన్ఫర్మేషన్ ఇవ్వడమే కాదు.. క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలనూ సూచిస్తుంది. ఈ ప్రాజెక్ట్ మన చేతుల్లోకి వస్తే.. 'స్మార్ట్ లైఫ్' అనే పదానికి కొత్త నిర్వచనం లభిస్తుందనడంలో సందేహం లేదు. టెక్నాలజీ మన ఊహల కంటే వేగంగా దూసుకెళు _న్నది. అల్లావుద్దీన్ దీపంలోని జెనీ.. కేవలం మూడు కోరికలే తీరుస్తుంది. గూగుల్ 'జెనీ' మాత్రం.. మన డిజిటల్ ప్రపంచంలో మరెన్నో అద్భుతాలు చేస్తుంది. వాటిని ప్రత్యక్షంగా చూడాలంటే.. కొన్ని రోజులు వేచి చూడాల్సిందే!

# మనిషే చరిత్ర నిర్మాత





ఒకప్పుడు ఇతర జంతువులతో పాటు అడవుల్లో నివశించి, తన మేధో శక్తితో ఆధునిక మానవుడిగా ఎదిగిన వైనాన్ని వివరించే శాస్త్రాన్ని మానవ శాస్త్రం అంటారు. చరిత్ర క్రమాన్ని వివరించడానికి ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. ఆంత్రోపాలజీ (మానవ శాస్త్రం) అనేది ప్రాచీన, ప్రస్తుత మానవ ప్రవర్తన, జీవశాస్త్రం, సంస్కృతులు, భాషాశాస్త్రాల గురించి అధ్యయనం చేస్తుంది. ఆంత్రోపాలజీ చదవడం వల్ల వైద్యం, ప్రజారోగ్యం, వ్యాపారం, పర్యావరణ పరిరక్షణ, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఫోరెన్సిక్, మ్యూజియం వంటి రంగాలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మానవ శాస్త్రము ఒక జీవ శాస్త్రం మాత్రమే కాక ప్రపంచంలో వేర్వేరు జాతుల, తెగల ప్రజలు, వారి మధ్య చారిత్రాత్మకంగా ఏర్పడిన భేదాలను కూడా తెలిపే సాంఘిక శాస్త్రం కూడా. మానవ శాస్త్రజ్ఞులు అనేక ప్రాంతాలలో పరిశోధనలు చేసి ప్రజలు ప్రస్తుతం ఎలా జీవిస్తున్నారో, పూర్వం ఎలా జీవించేవారో పురావస్తు శాస్త్రము ప్రకారంగా అధ్యయనం చేస్తారు. ఈ అధ్యయనాలు ఆధునిక నగరాల నుంచి పల్లెటూర్లు, అడవిలో నివసించే తెగల దాక విస్తరిస్తూ ఉంటాయి. వివిధ సమూహాల్లో జనం సమయాన్ని, స్థలాన్ని, జీవన శైలిని ఎలా అవగాహన చేసుకున్నారో, ఈ అధ్యయనాలు పరిశీలిస్తాయి. అమెరికన్ ఆంత్రోపోలాజికల్ అసోసియేషన్ 2015లో జాతీయ ఆంత్రోపాలజీ దినోత్సవాన్ని ప్రారంభించింది. మరుసటి సంవత్సరం, వారు దానిని ప్రపంచ ఆంత్రోపాలజీ దినోత్సవంగా మార్చారు. ఆంత్రోపాలజీ ఒక దేశానికి మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచానికి ముఖ్యమైనది. ఇందులో పురావస్తు శాస్త్రం చాలా ముఖ్యమైంది. సహజంగా ఇది ప్రతి ఏటా ఫిబ్రవరి మూడవ గురువారం వస్తుంది. ఈ లెక్క ప్రకారం ఈ ఏడాది న వచ్చింది. మనిషి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని ఆధునిక మానవుడిగా ఎదిగాడు. దీనికోసం ఎన్నో పోరాటాలు చేశాడు. మరెన్నో రాజ్యాలను ఆక్రమించుకున్నాడు. మత భావనలను దాటి సైన్స్‌లో ఎన్నో ఆవిష్కరణలు చేశాడు. ఎన్నో వ్యాధులకు నివారణ మార్గాలు కనిపెట్టాడు. ప్రతి పూర్వ తరం తర్వాత తరానికి అభివృద్ధి చెందిన ప్రపంచాన్ని వారసత్వంగా ఇచ్చింది. సైన్స్ అభివృద్ధితో దేశాల మధ్య సరిహద్దులు తొలిగాయి. కొత్త అవకాశాలు వచ్చాయి.

సృజనాత్మకత ప్రతి రంగంలో పెరుగుతుంది. కొత్త నైపుణ్యాలు అవసరం ఏర్పడుతుంది. మకొన్ని సవాళ్లు కూడా ఈ క్రమంలో ఎదురౌతున్నాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ రాజ్యమేలుతున్నది. ఇంకా కొన్ని దేశాల పాలకులు సంకుచిత భావనలతోనే ప్రజలను పాలిస్తున్నారు. ఇంకా ప్రపంచాన్ని యుద్ధ మేఘాలు ఎక్కడో ఒక చోట ఆవరిస్తూనే ఉన్నాయి. ఒకవైపు పెరుగుతున్న మతోన్మాదం, మరోవైపు వాతావరణ కాలుష్యం ప్రపంచాన్ని తిరోగామి దిశలోకి నెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మనిషి తన చరిత్రను పురోగామి దిశలో పయనింపజేయడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటాడనేది ఒక ఆసక్తికరమైన ప్రశ్న అవుతుంది.

# నెయ్యి టెండర్లలలో కొత్త పద్ధతికి శ్రీకారం



**తిరుమల,తెలంగాణ దిశ :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే ఆవు నెయ్యి కొనుగోలు ప్రక్రియలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. లడ్డూ నాణ్యత, స్వచ్ఛత విషయంలో భక్తుల నమ్మకాన్ని నిలబెట్టేలా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. చైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలోని నూతన టీటీడీ బోర్డు ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకుంది.గతంలో, అంటే 2024కు ముందు, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తుల నుంచి కొన్ని విమర్శలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన టీటీడీ, నెయ్యి కొనుగోలు విధానాన్ని సమూలంగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. నెయ్యి నాణ్యత రవాణా సమయంలో దెబ్బతినకుండా ఉండేందుకు, సేకరణ భౌగోళిక పరిధిని గతంలో ఉన్న 1500 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లకు తగ్గించారు. నెయ్యిని సరఫరా చేసే ట్యాంకర్లకు తప్పనిసరిగా జీపీఎస్ లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, రవాణాను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.నాణ్యత పరీక్షల విషయంలోనూ రాజీపడకుండా కఠిన ప్రమాణాలను నిర్దేశించారు. డైరీల తయారీ సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఓఖీఓ స్కోర్ బోర్డ్ విధానాన్ని, ఈూాఖీ 2.1.8 నిబంధనలతో పాటు మిల్క్ ఫ్యాట్ ప్యూరిటీ పరీక్షలు (ఎూా 17678:2019), సెన్సరీ పారామీటర్స్ (ఎూ అనీటవ: 7770:1975) వంటివి తప్పనిసరి చేశారు. ఈ సంస్కరణల్లో భాగంగా, 2024-25 సంవత్సరానికి గాను గుత్తాధిపత్యానికి తావివ్వకుండా మొత్తం 65 లక్షల కిలోల నెయ్యి సేకరణకు 7 విడతలుగా టెండర్లను నిర్వహించారు. ఈ పారదర్శక ప్రక్రియలో 7 ప్రముఖ డైరీ సంస్థలు పాల్గొనగా, వాటికి దక్కిన టెండర్ల వివరాలు ఇలా ఉన్నాయి: 1. నందిని (ఐఓఈ) - 4 టెండర్లు దక్కించుకుంది. 2. మదర్ డైరీ - 2 టెండర్లు దక్కించుకుంది. 3. ఇందాపూర్ డైరీ - 2 టెండర్లు దక్కించుకుంది. 4. సంగం డైరీ - 1 టెండర్ దక్కించుకుంది. 5. ప్రీమియర్ అగ్రి డైరీ - టెండర్ దక్కించుకోలేదు. 6. కొల్హాపూర్ డైరీ (గోకుల్) - టెండర్ దక్కించుకోలేదు. 7. గోవింద్ మిల్క్ - టెండర్ దక్కించుకోలేదుఈ మార్పుల ద్వారా భక్తులకు అత్యంత స్వచ్ఛమైన, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందించడమే తమ ప్రథమ కర్తవ్యమని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

## చిన్నారులకు పండ్లు పంపిణీ

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** కమాన్ పూర్ మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లలో శివసేన సమితి అధ్యక్షుడు గన్నెవరపు రవి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.కమాన్ పూర్ శివసేన సేవాసమితి అధ్యక్షులు గన్నెవరపు రవి ఆధ్వర్యంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. కమాన్ పూర్ మండలంలోని సిద్ధిపల్లెలో గల ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఛత్రపతి శివాజీ పోరాటం.. ఆయన విశిష్టత గురించి వివరించారు. అనంతరం కమాన్ పూర్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గజ్జెల శేఖర్ ఆర్ఎస్ఎస్ జిల్లా శారీరక ప్రముఖ హాజరైనారు. అలాగే ఈ కార్యక్రమంలో శివసేన సేవా సమితి అధ్యక్షులు గన్నవరపు రవి ఉపాధ్యక్షులు బిల్లా వెంకటేశ్వర్లు సుద్దాల కృష్ణమూర్తి దేవుని ఉరి చంద్రమౌళి గర్రెపల్లి సత్యం మానుక ఓదెలు జమాల్పూర్ శ్యామలాల్ ఏరువా సత్య రామ్ రాసకొండ సమ్మయ్య తడగొండ శ్రీను మట్ట మల్లేష్ పొరగంటి పోశాలు చెరుకు చందు తాటికొండ హరీష్ మేకల శ్రీనివాస్ కుందారపు మహేష్ కాస రవి మడ్డి సాయి తాటికొండ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడ కార్పొరేషన్ పై ఆశకిరణ్ గురి



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి కాస్త ప్రత్యేక స్థానం ఉంటుంది. దివంగత వంగవీటి రంగా రాజకీయ వారసత్వం పై ఎప్పుడు ఏదో ఒక చర్చ మనం చూస్తూనే ఉంటాం. వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధా రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ఆయన పెద్దగా యాక్టివ్ గా లేరు.. అనే ఆవేదన రంగ అభిమానుల్లో కనపడుతూ ఉంటుంది. ఇక ఇప్పుడు రంగా కుటుంబం నుంచి ఆయన కుమార్తె ఆశ కిరణ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఏ పార్టీలో చేరకపోయినప్పటికీ, ప్రజల్లో ఉంటానంటూ ఆమె చేసిన ప్రకటనలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ఆమెకు తెలుగుదేశం( పార్టీ లేదా జనసేన పార్టీలు ఆహ్వానం పలుకుతున్నాయని వార్తలు కూడా వచ్చాయి.అయితే ఇప్పుడు మరో వార్త బెజవాడ రాజకీయాల్లో సంచలనంగా మారింది. వంగవీటి ఆశ కిరణ్, విజయవాడ మేయర్ అయ్యే అవకాశాలు ఉండొచ్చు ప్రచారం మొదలైంది. గత కార్పొరేషన్ ఎన్నికల్లో మహిళను అప్పటి వైసిపి ప్రభుత్వం మేయర్ గా ఎంపిక చేసింది. ఇప్పుడు అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూటమి కూడా మహిళా నాయకురాలిని మేయర్ గా ఎంపిక చేసే అవకాశం ఉండవచ్చు. త్వరలోనే ఆమె జనసేన లేదా టిడిపిలో జాయిన్ అయ్యే అవకాశం ఉండవచ్చని.. ఈ ఏడాది చివర్లో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమె కార్పొరేటర్ గా నిలబడే అవకాశాలు ఉండవచ్చును అంటూ హడావుడి మొదలైందికాపు సామాజిక వర్గ ఓటు బ్యాంకు చీలకుండా, కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుంది. జనసేన రూపంలో మెజారిటీ కాపు సామాజిక వర్గం కూటమి వైపు ఉండగా.. వంగవీటి కుటుంబం ద్వారా కొంత కాపు సామాజిక వర్గాన్ని తమ వైపుకు తిప్పుకోవాలని వైయస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు వంగవీటి ఆశా కిరణ్ ద్వారా.. కాపు సామాజిక వర్గంలో చీలిక తీసుకురాకుండా ఉండే దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలోనే వంగవీటి రాధకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ ఇచ్చే అవకాశం కూడా ఉంది. ఇక ఇదే సమయంలో వంగవీటి రంగా కుమార్తెకు కూడా విజయవాడ మేయర్ పదవిని ఖరారు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండకపోవచ్చు. దీనిపై ఇప్పటికే కూటమి పెద్దలు నిర్ణయం తీసుకున్నట్లుగా కూడా సమాచారం.

# శాల పల్లె లో శివాజీ విగ్రహ ఆవిష్కరణ



కమాన్ పూర్ : కమాన్ పూర్ మండలం సిద్ధి పల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని శాల పల్లెలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. గ్రామపంచాయతీలో శాలపల్లె హనుమాన్ యూత్ వారి ఆధ్వర్యంలో శ్రీ మహారాజ చత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ ఘనంగా అంగరంగ వైభవంగా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బంగారం కళ్యాణి మహేష్, ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్, మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, గడ్డం శ్రీనివాస్, చిప్ప రాజ్‌కుమార్, బిల్లా వెంకటేష్, యూత్ సభ్యులు బిల్లా హరీష్, తాటికొండ హరీష్,కుందారపు మహేష్, మాటేటి అనిల్,చిప్ప అంజి, మాటేటి కుమార్ స్వామి, తాటికొండ సందీప్, తాటికొండ ప్రశాంత్, మాటేటి రాజ్ కుమార్, తౌటపు సాయి, మోర ప్రశాంత్ గారు తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


# రాజోలులో రగులుతున్న జ్వాల

**కాకినాడ ,తెలంగాణ దిశ :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు అనగానే ఓ ప్రత్యేకత ఉంటుంది. జనసేన పార్టీ నుంచి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గం అది. అదికూడా జనసేన పార్టీకి మొట్టమొదటి ఎమ్మెల్యేను గెలిపించి శుభారంభం ఇచ్చిన నియోజకవర్గం. ఈ నియోజకవర్గం అందుకే అంత ప్రత్యేకం. ఇదే విషయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా చాలా సందర్భాల్లో ప్రస్తావించారు. రాజోలు ఒక చిరుదివ్వె లాంటిదని కూడా ఆయన ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఈ నియోజకవర్గంలో మాత్రం జనసేన ఎమ్మెల్యే పనితీరుపై ఆ పార్టీలోనే అసంతృప్తి జ్వాలలు రేగుతోన్నాయా అన్న ప్రశ్నకు అవుననే సమాధానం ఆపార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఇదే నియోజకవర్గంలో టీడీపీ తన ఉనికిని కాపాడుకునేందుకు కూడా భారీ స్థాయిలో ప్రయత్నిస్తోంది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్యను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించింది. దీంతో రాజోలులో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. కూటమి ప్రభుత్వంలో ఏ కార్యక్రమానికైనా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే రాజోలు నియోజకవర్గంలో మాత్రం టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న అమూల్యకు చాలా ప్రభుత్వ కార్యక్రమాలకు అసలు సమాచారం ఇవ్వడం లేదన్నది ఆమె తన అనుచరుల వద్ద వాపోతున్నారట. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానానికి కూడా తెలిపినట్లు తెలుస్తోంది. నియోకవర్గాల్లో పలు నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ కూడా కనీస సమాచారం ఇవ్వకుండా తనకు నచ్చిన వారినే నియమించుకుంటున్నారని, వారి పార్టీ వరకు పరవాలేదు కానీ టీడీపీ నుంచి నియమించిన వారి విషయంలో కూడా తన వ్యతిరేకులకు కట్టబెట్టి తనకు వ్యతిరేక వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని అమూల్య వాదనగా తెలుస్తోంది. ఉదాహరణకు ఇటీవలే ఇచ్చిన అంతర్వేది ఆలయ కమిటీ ఛైర్మన్ విషయంలోనూ ఇదే జరిగిందన్నది అమూల్య వర్గీయుల వాదనగా వినిపిస్తోంది. అంతర్వేది లక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిని టీడీపీ నేతకే ఇచ్చామని ఎమ్మెల్యే దేవవరప్రసాదరావు చెబుతున్నా ఈ సమాచారం తనకు చెప్పలేదని, తాను ప్రతిపాదించిన పేరు వేరే నాయకుడిది కాగా వారికి అనుకూలమైన వారికే పదవి కట్టబెట్టారన్నది అమూల్య మాటగా చెబుతున్నారు ఆమె అనుచరులు.

ఇదే కాకుండా నియోజకవర్గంలో నియమించిన పలు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీకి ఇవ్వాల్సిన పదవుల్లో కూడా తన జోక్యం లేకుండా చేస్తున్నారని, నియోజకవర్గంలో అసలు ఒక ఇంచార్జ్ ఉన్నారన్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని అమూల్య బాధపడుతున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో టీడీపీ అధిష్టానం కూడా జోక్యం చేసుకుంటున్న సందర్భాలు చాలా తక్కువనే చెబుతున్నారు విశ్లేషకులు. ఇదే విషయం రాజోలు నియోజకవర్గంలో కూడా వర్తిస్తుందంటున్నారు. అందులోనూ జనసేన అధినేతకు రాజోలు నియోజకవర్గం అంటే మరింత ప్రత్యేకం కాగా ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తోన్న దేవ వరప్రసాదరావు మాజీ ఐఏఎస్ అధికారి కావడం, ఆయనకు అధినేతతో అత్యంత సాన్నిహిత్యం ఉండడం ఆయన మాటే వేదం అవుతుందంటున్నారు. ఈ పరిస్థితుల్లో అంతర్గతంగా జనసేన, టీడీపీ నేతల మధ్య అసంతృప్తి పరిస్థితులున్నా కూడా అవేమీ ఇరు పార్టీ నాయకత్వాలు పట్టించుకునే పరిస్థితి ఉండదని, లైట్ తీసుకుంటున్నాయంటున్నారు.ఇదిలా ఉంటే జనసేన పార్టీలోనే ఎమ్మెల్యేపై అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే రెండు వర్గాలుగా అంతర్గత యుద్ధాలే జరుగుతున్నాయి.. అవి ఎంతలా అంటే సోషల్ మీడియా వేదికగా కూడా ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకునేంత స్థాయిలో అంతర్గత విభేధాలు భగ్గుమంటుండగా కొందరైతే బాహాటంగా ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

దీనికి తోడు ఇటీవల కాలంలో వైసీపీకకు చెందిన కొందరు జనసేన పార్టీలో దూరి ఎమ్మెల్యే అనుచరులుగా చక్రం తిప్పడం ముందు నుంచి పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు అసలు మింగుడు పడని అంశంగా మారింది. దీంతో ఎమ్మెల్యే తీరుపై కూడా కొందరు అధిష్టానానికి ఇప్పటికే ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీలో అంతర్గత పోరు విషయం ఇలా ఉంటే ఇక టీడీపీలో కూడా రెండు వర్గాలుగా మాటల యుద్ధం సాగుతోంది. ఇంచార్జ్ అమూల్యపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు ఆ పార్టీలోనే కొందరు నేతలు. అమూల్య ఒంటెద్దు పోకడలతో కొందరినిమాత్రమే వెంటేసుకుని వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తం మీద రాజోలు నియోజకవర్గంలో అటు జనసేన, ఇటు టీడీపీలో అంతర్గత కోల్డ్ వార్ అయితే జరుగుతోందంటున్నారు.

## 122 ఏండ్ల తర్వాత తెరుచుకోనున్న 'కోణార్క్' గర్భ గుడి



కోణార్క్:ఒడిశాలోని 13వ శతాబ్దపు కోణార్క్ సూర్య దేవాలయ గర్భ గుడిలోకి త్వరలో భక్తులు ప్రవేశించే అవకాశం రానున్నది. ప్రస్తుతం ఆ స్థలం ఇసుకతో నిండి ఉంది. దాన్ని ఇప్పుడు తొలగిస్తున్నారు. ఆలయం వెనుక ఉన్న 15 అడుగుల ఎత్తయిన గోడ కూలిపోకుండా నిరోధించడానికి బ్రిటిష్ పాలకులు 1903-04లో గర్భ గుడిని వేల టన్నుల ఇసుకతో నింపారు. జగ్‌మోహన్ హాల్‌గా పిలిచే ఈ ప్రాంతంలోకి శతాబ్దం పాటు ఎవరూ ప్రవేశించలేదు. తాజాగా భారత పురావస్తు శాఖ, ఐఐటీ మద్రాస్ నిపుణులతో కూడిన బృందం ఈ ఇసుకను తొలగించే పని చేపట్టింది. మొత్తం ఇసుకను తరలించడానికి మూడు నెలలు పడుతుందని ఓ పురావస్తు శాఖ అధికారి తెలిపారు. ఇసుకను తరలించిన తర్వాత లోపలి గోడల పటిష్ఠతను పరిశీలించి గుడి పునర్ నిర్మాణంపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

## కౌన్సిలర్ గా నాకు వచ్చే వేతనాన్ని ప్రతి నెల ఒక నిరుపేదకు అందిస్తా

**-బోయిన్ పేట అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా**

**-6వ వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి**



**మంథని,తెలంగాణ దిశ :**బోయిన్ పేట ప్రజల మాటే నాకు శిరోదార్యమని, కౌన్సిలర్ గా తనకు నెల నెల వచ్చే వేతనాన్ని ప్రతి నెల బోయిన్ పేట లోని ఒక నిరుపేద కుటుంబానికి అందజేస్తానని 6వ వార్డు కౌన్సిలర్ పోతరవేని శ్రీలత-క్రాంతికుమార్ తెలిపారు.బుధవారం రాత్రి బోయినిపేట నాగులమ్మ దేవాలయం వద్ద బోయినిపేట ప్రజలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పోతరవేని శ్రీలత,మత్స్య పరిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతికుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన మంథని మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు ఎన్నో ఒత్తిడులకు గురిచేసిన కూడా వాటిని లెక్కచేయకుండా ఇంతటి భారీ విజయాన్ని అందించిన బోయిన్ పేట్ 6 వార్డ్ ప్రజలకు అండగా నిలిచి ప్రభుత్వం అందించే పథకాలను ఆరో వార్డు ప్రజల గడప కాడికి అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.బోయిన్ పేట అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని, గతంలో చేసిన సేవలు అలాగే కొనసాగుతాయని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో బోయిన్ పేట మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్త కొత్త ఎత్తుగడలతో సైబర్ మోసాలు

### అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు

### హైచ్చరించిన సైబర్ పోలీసులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడవద్దని పోలీసులు హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్ల వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని ప్రజలను హెచ్చరించారు. పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్ ఫారమ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమవుతాయని కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ అంటూ, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశాలతో లింక్ లు వస్తుంటాయని, ఆ లింక్ లను క్లిక్ చేసి మోసపోవద్దని, చిన్నగా 500 డాలర్లు గిఫ్ట్ కార్డ్‌ను గెలుచుకోండి అని మెసేజ్‌లు వస్తుంటాయని, ఆ లింక్ లపై క్లిక్ చేసిన తర్వాత దానితో ఓ లింక్ కూడా ఉంటుందని, దీనికి ఇచ్చే కాప్షన్ కూడా మిమ్ములను ఆ లింక్ క్లిక్ చేసే విధంగా పురిగొల్పుతుందన్నారు. కాబట్టి ఎలాంటి పరిస్థితిలలోను అపరిచి తుల నుంచి వచ్చిన లింక్ లపై క్లిక్ చేయవద్దని, మీ వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫోటోలు అపరిచిత లింక్ లలో పంచుకోవద్దు అని సూచించారు. ఒకవేళ ఆ లింక్‌లో వివరాలు ఇస్తే మీ వ్యక్తిగత వివరాలు మీ ఫోన్ నంబర్ ఆధారం గా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు, మీ దగ్గర లోని పోలీసు స్టేషన్ నంబర్ కు గాని కాల్ చేయాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# రాజేందర్, రఘునందనరావులు ఎందుకలా..?

హైదరాబాద్,తెలంగాణ దిశ :తెలంగాణ బీజేపీ ఎంపీలు ఇద్దరు కాస్త తేడాగా వ్యవహరించారా? వాళ్ళ నిర్ణయంతో పార్టీ కేడర్ కూడా షాక్ అయిందా? ఆ మార్పు పార్టీకి తెలిసే జరిగిందా? లేక వ్యక్తిగతమా? ఎవరా ఇద్దరు లోక్‌సభ సభ్యులు? తేడా అనిపించేలా ఏం చేశారు? తెలంగాణలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. అందులో చిత్ర విచిత్ర పరిణామాలు చోటు చేసుకున్నాయి. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో ఎవరు ఎవరితో కలిశారు, ఏం పంచుకున్నారన్నది చివరి వరకు ఉత్కంఠగా మారి?.. సస్పెన్స్ థ్రిల్లర్‌ని మరిపించింది. ఈ విషయంలో కమలం పార్టీ వైఖరి గురించి ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయి. కాషాయ దళం ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కోలా వ్యవహరించి అసలు వీళ్ళు ఎటున్నారన్న సంగతి అర్థంకా కుండా చేసింది. అనైతిక పొత్తులు పెట్టుకోబోం, ఎవరితో కలవబోమం టూ?. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్న కొన్ని చోట్ల ఉన్న అవకాశాన్ని వదిలేసుకుంది బీజేపీ. సరే? అది మంచి సంప్రదాయం, ఆదర్శవం తమైన రాజకీయం అనుకుంటుండగానే?మరికొన్ని చోట్ల అన్నిటినీ పక్కన పెట్టేసి అధికారం కోసం ప్రత్యర్థులతో జతకట్టి ముక్కున వేలేసుకు నేలా చేసింది. ఒకచోట కాంగ్రెస్‌తో, మరొక చోట బీఆర్ఎస్‌తో చేతులు కలిపిన తీరును చూసి వీళ్ళేంటో? వీళ్ళ విధానాలేంటో? అసలేం అర్ధంకావడం లేదన్న రాపు రమేష్ సినిమా డైలాగ్‌ని గుర్తు చేసుకుం టున్నారు పొలిటికల్ పండిట్స్. అందరిలాగే? బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యే లు తమ నియోజకవర్గ పరిధిలోకివచ్చే మున్సిపాలిటీల్లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్నారు. ముందే అంచనాలు వేసుకుని పార్టీకి అవసరం అనుకున్న చోట నమోదు చేసుకున్నారు. అయితే? ఇద్దరు ఎంపీలు అండ్ సీనియర్ లీడర్స్ రఘునందన్ రావు, ఈటల రాజేందర్ అందుకు భిన్నంగా వ్యవహరించారు. అస్సలు ఎవరూ ఊహించని చోట వాళ్ళు ఎక్స్‌అఫిషియో ఓటర్స్‌గా నమోదు చేసుకు న్నారు. ఈ విషయం బయటికి తెలిశాక ఆశ్చర్యపోతున్న చాలామంది వాళ్లు అక్కడే ఎందుకు నమోదు చేసుకోవాల్సి వచ్చింది? బ్యాక్‌గ్రౌండ్ స్టోరీ ఏంటి అంటూ చర్చించుకుంటున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఎక్స్ అఫిషియోగా నమోదయ్యారు. ఇక ఈటల రాజేందర్ ఎల్లంపేట మున్సిపాలిటీలో చేసుకున్నారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే? ఇస్నాపూర్‌లో బీజేపీ ఒక్క వార్డ్ కూడా గెలుచుకోలేదు. అయినా సరే? ఎంపీ అక్కడెందుకు ఓటు నమోదు చేసుకున్నారన్నది మిలియన్ డాలర్ క్వశ్చన్. పైగా?.





లోకల్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, రఘునందన్‌రావు కలిసి ఒకే కారులో రావడం చూసి అక్కడున్నవారంతా షాకయ్యారట. దీని గురించే పార్టీలో హాట్ హాట్ డిస్కషన్ నడుస్తోంది. మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకుని మళ్ళీ పాత గూటికి చేరుకునే ప్రయత్నంలో ఉన్నారు.

ఆ ఎన్నికల్లో మహిపాల్‌రెడ్డి వర్గం మొత్తం బీఆర్ఎస్‌కే సపోర్ట్ చేసిందన్నది లోకల్‌గా చెబుతున్న మాట. పైగా? ఇస్నాపూర్‌లో ఛైర్మన్ సీటును బీఆర్ఎస్ గెల్చుకుంది. బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేయాలన్నది ఎంపీ సొంత నిర్ణయమా లేక ఇంకేదన్నా స్టోరీ ఉందా అన్న కన్ఫ్యూజ న్‌లో ఉన్నారట బీజేపీ నాయ కులు. స్థానిక రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని రఘునందన్‌రావు ఆ నిర్ణయం తీసుకున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నా?. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి ఒకే కారులో రావడం చూస్తుంటే? అనైతిక పొత్తులు పెట్టుబోకోబోమన్న మాటలకు అర్థం ఏంటో తెలి యడం లేదని మాట్లాడుకుంటున్నారు పార్టీ నాయకులు. ఇదే సమ యంలో ఇస్నాపూర్‌లో బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేసి మరోచోట ఆ పార్టీ మద్దతుతీసుకున్నారా అన్న చర్చలు సైతం నడుస్తున్నాయి.పార్టీకి తెలిసే ఎంపీ ఆపని చేశారని అంటున్నా? ఎమ్మెల్యేతో కలిసి రావడాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోతున్నాయట స్థానిక కాషాయ శ్రేణులు. ఇక ఈటల రాజేందర్ విషయానికి వస్తే?. ఆయన ఎల్లంపేటలో ఎందుకు ఎక్స్‌అఫిషియోగా నమోదు చేసుకోవాల్సి వచ్చింది?. తెరవె నుక జరిగిన పరిణామాలు ఏంటన్న చర్చలు జోరుగా నడుస్తున్నాయి. మంచో చెడో చేసుకున్నారు సరే?. మరి ఛైర్మన్ ఎన్నికను ఎందుకు స్కిప్ చేశారన్నది ఇంకో పెద్ద ప్రశ్న. మేడ్చల్ మల్కాజ్ గిరి పరిధిలోఆ పార్టీ ఒక చోట బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వగా మరో చోట కాంగ్రెస్‌కు ఇచ్చింది. రెండు చోట్ల బీజేపీకి వైస్ ఛైర్మన్ పదవి దక్కింది. అటు ఎల్లంపేటలో ఎమ్మెల్యే మల్లారెడ్డికి, ఈటలకు మధ్య చర్చలు జరిగాయని, కానీ? అవి సక్సెస్ కాలేదన్న ప్రచారం ఉంది. తాను అనుకున్న విధంగా పరిణామాలు జరక్కపోవ డం వల్లనే ఈటల ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. రేపు గ్రేటర్ పరిధిలో జరిగే మూడు మున్సిపల్ కార్పొరేషన్స్‌లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకునే అవకాశం ఇద్దరు ఎంపీలకు ఉన్నా? దాన్ని వదిలేసి ఇలా చిన్న పురపాలక సంస్థల్లో ఎందుకు నమోదు చేసుకున్నారన్నది చర్చనీయాంశమైంది.

# కార్మిక చట్టాలను తుంగలో తొక్కడం దారుణం

### కొత్త చట్టాలతో కార్మికుల హక్కులకు భంగం

### కేంద్రం తీరుపై మండిపడ్డ లెఫ్ట్ నేతలు

**విజయవాడ,తెలంగాణ దిశ :**కార్మిక చట్టాల రద్దు గురించి పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుపట్టినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని లెఫ్ట్ నేతలు మండిపడ్డారు. ఈ కోడ్‌ల ప్రకారం దేశంలోని 70 శాతం పరిశ్రమల్లోని 74 శాతం కార్మికులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకుండా పోతున్నాయి. ప్రజా సంక్షేమ చట్టాలను రద్దు చేస్తూ కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను నివారించగలిగే స్థితి రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలకు వుంది. ఈ పార్టీలు మద్దతు ఇవ్వకపోతే కేంద్ర ప్రభుత్వం మనుగడ కోల్పోతుంది. మన రాష్ట్రంలోని గ్రామీణ కూలీలకు, మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు తోడ్పడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కుదించి రాష్ట్రంపై భారం వేస్తున్న బిల్లును బలపరచి ఆర్థిక భారం రాష్ట్రంపై వేయవద్దని టిడిపి ఎంపీ కోరడం విడ్డూరంగా వుంది. చట్టబద్ధంగా రాష్ట్రానికి రావలసిన నిధులే ఇవ్వని కేంద్రం ఈ విజ్ఞప్తులకు, విన్నపాలకు స్పందిస్తుందా అని అన్నారు. స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి ఏలుబడిలో బ్రిటిష్ కాలం నాటి 12 గంటల పని విధానాన్ని అమలులోకి తెచ్చింది. కార్మికుల జన్మహక్కుగా వున్న సమ్మె హక్కు ప్రమాదంలో పడింది. గతంలో జర్మనీ, ఇటలీ దేశాల్లో ఫాసిస్టు పాలకులు చేసిన మొదటి పని కార్మిక సంఘాలను నిషేధించడం, వారి చట్టబద్ధ హక్కులను కాలరాయడం. నేడు దేశంలో అదే తరహా విధానాలు అమలవుతున్నాయని సిపిఎం నేతలు మధు, గఫూర్‌లో వేర్వేరుగా అభిప్రాయపడ్డారు. 2005లో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ వ్యవసాయ కూలీలకు పనిని హక్కుగా ఇచ్చింది. ఆ హక్కును తొలగించి, రాష్ట్రాలపై నిధుల భారం వేస్తూ వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (విబి-జి ఆర్ఎమ్ జి) బిల్లును ఆమోదించుకున్నారు. వారి మతతత్వ ఎజెండాకు అనుగుణంగానే పాత చట్టంలోని మహాత్మా గాంధీ పేరును తొలగించి 'రామ్' వచ్చేలా పేరు పెట్టారని మండిపడ్డారు. గత ఐదు సంవత్సరాలుగా ఉపాధి చట్టానికి కేంద్రం నిధులు తగ్గిస్తూ వచ్చింది. ఈ చట్టంలో అవినీతి జరుగుతుందని, వ్యవసాయ సమస్యలకు కారణమని, ఉచిత పథకాలు ఎంత కాలమని బిజెపి నేతలు, వారి అనుంగ మీడియా చాలా కాలంగా చేస్తున్న ప్రచారానికి తగ్గట్టుగానే కొత్త బిల్లును తెచ్చారని మండిపడ్డారు. 12.16 కోట్ల మంది గ్రామీణ పేదలకు ఇచ్చే ఈ అతికొద్ది మొత్తమే అవినీతి, అక్రమం అయితే మోడీ 11 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ కంపెనీలకు రూ.17.2 లక్షల కోట్ల రుణాలను రద్దు చేయడాన్ని ఏమనాలని నిలదీశారు. ఇదికాక బ్యాంకుల్లో తీసుకున్న మరో 10 లక్షల కోట్లు చెల్లించకుండా మొండి బకాయిలుగా మార్చి బ్యాంకులను దివాళా తీయించడాన్ని ఏమనాలన్నారు. ప్రభుత్వ రంగంలో బీమా కంపెనీలు ఉండడం వల్ల ప్రజల సొమ్ముకు, దేశ ఆర్థికవ్యవస్థకు భద్రత వుంటుందని 1956లో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను జాతీయం చేశారు. అదే సంవత్సరం సెప్టెంబర్ 1న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ప్రభుత్వ రంగంలో ఏర్పడింది. 98 శాతం క్లెయిమ్‌లను సకాలంలో అమలు చేసి ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన బీమా కంపెనీగా ఎల్ఐసి అభివృద్ధి చెందింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా వుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.54.52 లక్షల కోట్ల విలువైన ఆస్తులు కలిగిఉంది. ఈ రంగాన్ని కబ్జా చేయాలని చాలా కాలంగా దేశ, విదేశీ బీమా కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. ఈ రంగంలో 50 శాతం లోపు మాత్రమే ప్రైవేట్ పెట్టుబడులు వుండాలనే నిబంధనను క్రమంగా సవరిస్తూ 74 శాతానికి పెంచారు. ఇప్పుడు ఏకంగా 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ మోడీ ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పాస్ చేసుకుంది. ఈ నిర్ణయం పాలసీదారుల వ్యక్తిగత గోప్యతకు, దేశ ఆర్థిక భద్రతకు అత్యంత ప్రమాదం అని వారు అభిప్రాయపడ్డారు.

## పిల్లలు, గర్భిణీలకు కీలక సేవలు అందిస్తున్న అంగన్వాడీలు

### మేయర్ కొలగని శ్రీనివాస్

**కరీంనగర్,తెలంగాణ దిశ :** అంగన్వాడి సేవలు నేడు సమాజానికి కీలకంగా మారాయని,బాల బాలికలకు, గర్భవతులకు పుష్టికరమైన ఆహారము అందించాలనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల వ్యవస్థను ప్రవేశపెట్టిందని కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ అన్నారు. గురువారం రోజున కోతి రాంపూర్ పరిధిలో గల అంగన్వాడీల కేంద్రాల ఐసిడిఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, పౌష్టికాహారం, ముందస్తు విద్య, ఆరోగ్య తనిఖీలు , టీకాలు వంటి ఎన్నో ముఖ్యమైన సేవలు అంగన్వాడీల ద్వారానే అందుతున్నాయన్నారు. ఈ సేవలు అందించడంలో అంగ న్వాడి టీచర్లు కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. గర్భిణీలు బాలింతలకు అవసరమైన పోషకాహారంతో పాటు పిల్లల పెరుగు దల, ఆరోగ్య పటిష్టత కోసం అందించే బాలామృతం, కోడిగుడ్లు ను సక్రమంగా అందించాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లపై ఉందన్నారు.ఎందుకంటే పిల్లల తల్లుల అభివృద్ధి ఎదుగుదల అంగన్వాడి టీచర్ల పనితీరుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా పేదవారి పిల్లలు, పేద మహిళలకు అంగన్వాడీ పరిధిలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాసం గణేష్, పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, డి డబ్ల్యు ఆఫీసర్ సరస్వతి, సిడిపిఓ ఆఫీసర్ సబితలతో పాటు ఐసిడిసిఎస్ సూపర్వైజర్స్, స్టాఫ్, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# అధికారమే పరమావధి

# విలువలు, సిద్ధాంతాలు జానాసై

హైదరాబాద్,: రాజకీయం అంటేనే అవకాశవాదం అని నేటి నేతలు మరోసారి నిరూపించారు. సిద్ధాంతాలు, విలువలు, పార్టీ జెండాలు.. ఇవన్నీ కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితమని, అధికారం చేతికి చిక్కే అవకాశం వస్తే శత్రువునైనా కౌగిలించుకోవడానికి సిద్ధమని తెలంగాణ మున్సిపల్ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. నిన్నటి వరకు ఒకరిపై ఒకరు నిప్పులు కురిపించుకున్న నేతలు, నేడు పదవుల పంపకాల కోసం 'భాయీ-భాయీ' అంటూ చేతులు కలపడం చూస్తుంటే సామాన్య ప్రజలు విస్తుపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. దీంతో పార్టీలు తమ రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి చేతులు కలిపాయి. ఆదిలాబాద్ లో బిజెపి ఎక్కువ స్థానాలు గెలిచినప్పటికీ, కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎంలు ఏకమై బిజెపిని అధికారానికి దూరం చేశాయి. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిని ఛైర్‌పర్సన్‌గా నిలబెట్టి గెలిపించింది. భైంసా ఎంఐఎం కంచుకోట. ఇక్కడ బిజెపి రెబల్ అభ్యర్థికి కాంగ్రెస్, స్వతంత్రులు మద్దతు ఇవ్వడం గమనార్హం. నర్సాపూర్, ఆమనగల్లులో కాంగ్రెస్, బిజెపిలు పరస్పరం సహకరించుకున్నాయి. కాంగ్రెస్‌కు ఛైర్మన్ పదవి దక్కితే, బిజెపి వైస్ ఛైర్మన్ పదవిని తీసుకుంది. మెదక్ లో బిజెపి గైర్హాజరు కావడం ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఓటుతో అక్కడ కాంగ్రెస్ పీఠాన్ని దక్కించుకుంది. ఇస్నాపూర్ లో బిజెపి ఎంపీ రఘునందన్ రావు తన ఓటును బిఆర్ఎస్ అభ్యర్థికి వేయడం ద్వారా అక్కడ బిఆర్ఎస్ గెలుపొందింది.మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో కనిపిస్తున్న దృశ్యాలు రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్టగా నిలుస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఉప్పు-నిప్పులా ఉండే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కొన్ని మున్సిపాలిటీల్లో ఒకే తాటిపైకి వచ్చాయి. "బిజెపి-బిఆర్ఎస్ ఒక్కటే" అని కాంగ్రెస్ విమర్శిస్తుంటుంది, "కాంగ్రెస్-బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం" చేసుకున్నాయని బీజేపీ ఆరోపిస్తుంటుంది. కానీ, తీరా పదవుల విషయానికొచ్చేసరికి ఈ ఆరోపణలన్నీ గాలికి కొట్టుకుపోయాయి. కేవలం అధికారం దక్కించుకోవడమే పరమావధిగా, ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ ఈ 'మిలాఖత్' రాజకీయాలు సాగుతున్నాయి.ప్రతి పార్టీకి ఒక సిద్ధాంతం ఉంటుంది. ప్రజల ముందుకు వెళ్లేటప్పుడు తాము ఫలానా పార్టీకి వ్యతిరేకమని, వారి పాలన అస్తవ్యస్తమని గొంతు చించుకుని ప్రచారం చేస్తారు. కానీ, ఫలితాల తర్వాత మ్యాజిక్ ఫిగర్ రాకపోతే, వెంటనే తమ బద్ధశత్రువుతోనే జతకడతారు. ఇది ఓటర్లను మోసం చేయడమే. ప్రజలు ఒక పార్టీ సిద్ధాంతాన్ని నమ్మి ఓటేస్తే, గెలిచిన ప్రతినిధులు మాత్రం తమ స్వప్రయోజనాల కోసం వ్యతిరేక పార్టీతో చేతులు కలపడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు.ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్ గిరి దక్కించుకోవడం వెనుక కేవలం రాజకీయ అధికారం మాత్రమే కాదు, ఆర్థిక ప్రయోజనాలు కూడా ముడిపడి ఉంటాయనేది బహిరంగ రహస్యం. భూములకు అనుమతులు, టెండర్లు, నిధుల మంజూరు వంటి అంశాల్లో చక్రం తిప్పవచ్చనే ఆశతోనే, నేతలు తమ ఆత్మగౌరవాన్ని కూడా పక్కన పెట్టి పొత్తులకు సిద్ధపడుతున్నారు.ఈ వింత పోకడల వల్ల అత్యంత నష్టపోయేది క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్తలే. ఎన్నికల సమయంలో తమ పార్టీ గెలవాలని, ప్రత్యర్థి పార్టీ నాయకులతో గొడవలకు దిగి, కేసులు వేయించుకుని, శత్రుత్వం పెంచుకునేది కార్యకర్తలు. తమ నాయకుడు గెలవగానే తమ కష్టాలు తీరుతాయని ఆశిస్తారు. కానీ, గెలిచిన తర్వాత అదే నాయకుడు ప్రత్యర్థి పార్టీ నేతతో కలిసి విందులు ఆరగిస్తూ, పదవులు పంచుకుంటూ ఉంటే.. ఆ కార్యకర్తలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తల పట్టుకుంటున్నారు.తెలంగాణలో చోటు చేసుకుంటున్న ఈ 'అడ్డగోలు' పొత్తులు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సిద్ధాంతాలను వదిలేస్తే, వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుంది. పదవుల కోసం పడి చచ్చే నేతలు.. తాము ఎవరి కోసం ఈ పదవులు చేపట్టామో, ఎవరి ఓట్లతో గెలిచామో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. పార్టీల మధ్య ఈ అపవిత్ర కలయికలు దేశ రాజకీయాలకే చేటు. ఇప్పటికైనా నేతలు తమ వైఖరి మార్చుకోకపోతే, భవిష్యత్తులో ప్రజలే వారిని రాజకీయ తెర నుంచి తప్పించడం ఖాయం.

## సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి 'లోక' సీక్వెల్



'లోక: చాప్టర్ 1' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్. ఈ సూపర్ ఉమెన్ ఫాంటసీ థ్రిల్లర్‌లో ఆమె అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కాయి. గత ఏడాది మలయాళంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'లోక: చాప్టర్ 1' రికార్డులు సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సీక్వెల్ గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవలే ఓ ఈవెంట్‌లో పాల్గొన్న కల్యాణి ప్రియదర్శన్ సీక్వెల్‌లో తాను భాగమవుతున్నానని వెల్లడించింది. ప్రస్తుతం స్క్రిప్ట్‌వర్క్‌లో ఉన్న ఈ సినిమా సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి వెళ్తుందని, సీక్వెల్‌లో విజువల్స్‌కు అధిక ప్రాధాన్యం ఒటుందని.. కథ, కథనాలు మరింత ఉత్కంఠను పంచుతాయని తెలిపింది.




## తెలంగాణ నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం'



సినిమాల ఎంపికలో అనుపమ పరమేశ్వరన్ తన ప్రాధాన్యతలను మార్చుకుంది. కొత్తదనం కలబోసిన కథల్ని ఎంచుకుంటూ పాత్రలపరంగా ప్రయోగాలకు సిద్ధమంటున్నది. తెలుగులో ఈ భామ నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. నరేష్ వీకే, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బూసమ్ జగన్ నిర్మిస్తున్నారు. బుధవారం అనుపమ పరమేశ్వరన్ పుట్టిన రోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో పెళ్లి కూతురుగా ముస్తాబై పట్టరాని ఆనందంతో డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నది అనుపమ పరమేశ్వరన్. పెళ్లి చుట్టూ సాగే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఆమె కీర్తి అనే పాత్రలో కనిపిస్తుందని, తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ ధూపాటి, సంగీతం: సురేష్ బొబ్బిలి, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: బద్రప్ప గాజుల.

## విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' ' ఫలక్‌ను మా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భా షల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.

## మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్



టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంట్టంల్గ÷న్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెంద్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత.

రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

## తమన్నా, పూజా హెగ్డే. మధ్య పోటీ!



సినీ రంగం లో తమన్నా, పూజ హెగ్డే లకు ఉన్న క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఏటా ఎంతో మంది యంగ్ హీరోయిన్లు ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టొచ్చు, కానీ వీళ్లిద్దరి క్రేజ్ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. హిట్, ఫ్లాప్ లతో సంబంధం లేకుండా, వరుసగా సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్నారు ఈ ఇద్దరు హీరోయిన్స్. అయితే వీళ్లకు ఏ మాత్రం సంబంధం లేని రాజకీయాలు, ఇప్పుడు వీళ్లిద్దరు చుట్టూ తిరుగుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం లో ఉండే మైసూర్ శాండిల్ సోప్ కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించేందుకు తమన్నా ని ఎంపిక చేశారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మైసూర్ శాండిల్ సోప్స్ కి ఉన్న క్రేజ్ మామూలుది కాదు. ఈమధ్య కొత్త ప్రొడక్ట్స్ కారణంగా ఈ బ్రాండ్ కి కాస్త క్రేజ్ తగ్గింది.అందుకే ప్రభుత్వం ఈ సోప్ ను రీ బ్రాండింగ్ చేస్తూ, నేడు లాంచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఈ బ్రాండ్ కి తమన్నా ని ఎంపిక చేయడం పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంతో మంది హీరోయిన్లు ఉన్నారు, వాళ్ళని బ్రాండ్ అంబాసిడర్ గా ఎంచుకోవచ్చు కదా, ఎందుకు తమన్నా ని ప్రత్యేకించి తీసుకున్నారు. కర్ణాటక లో పుట్టిన పెరిగిన పూజా హెగ్డే ని ఎందుకు ఎంచుకోలేదు?, ఆమెతో పాటు రష్మిక మందాన,రుక్మిణి వాసంత్, శ్రీనిధి శెట్టి వంటి పాన్ ఇండియన్ స్టార్ హీరోయిన్లందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారే. క్రేజ్, ఫాలోయింగ్, ఫేమ్ విషయంలో వీళ్ళు తమన్నా కి ఏ మాత్రం తీసిపోరు. అయినప్పటికీ వీళ్ళలో ఎవరో ఒకరిని ప్రభుత్వం ఎందుకు ఎంచుకోలేదు అంటూ నిలదీస్తున్నారు.

ప్రతి పక్ష పార్టీ కి చెందిన నేతలు.బీజేపీ పార్టీ నాయకులూ కూడా ఈ విషయం లో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబడుతున్నారు. స్థానిక తారలను విస్మరించడం స్థానిక కాంగ్రెస్ నేత కన్నడ వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శమని అంటున్నారు. అలా తమన్నా, పూజా హెగ్డే , రష్మిక వంటి హీరోయిన్ల పేర్లు రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా అక్కడి నేతలు తీస్తున్నారు. అయితే కర్ణాటక ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను లెక్క చేయడం లేదు, వాళ్లకు చేయాలనుకున్న పనులు చేస్తూ ముందుకెళ్తున్నారు. ఈ నిర్ణయం పూర్తిగా వ్యాపార కోణం లో తీసుకున్నదే, ఇందులో భావోద్వేగాలకు చోటు లేదు, ప్రతిపక్షాలు ఈ అంశాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయాలనీ అనుకోవడం వాళ్ళ దిగజారుడు తనానికి నిదర్శనం అంటూ మండిపడుతున్నారు కాంగ్రెస్ నేతలు.

## అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు

తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు.భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది.

## ఫ్యామిలీపై విమర్శలు చేస్తే ఊరుకునేదే లేదు



గత ఏడాది జరిగిన 'బ్రహ్మానందం' సినిమా ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి చేసిన సరదా వ్యాఖ్యలు అప్పట్లో సోషల్ మీడియాలో పెద్ద వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. ఇంటికి వెళ్తే "లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా ఉంటాను" అంటూ కుటుంబంలో మహిళల ప్రాధాన్యత గురించి సరదాగా చెప్పిన ఆ వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. ఆ కామెంట్స్ మళ్లీ తాజాగా ట్రెండ్ అయ్యాయి. ముఖ్యంగా రామ్ చరణ్ – ఉపాసన దంపతులకు బాబు పుట్టిన సందర్భంగా ఆ పాత వీడియోలను తీసుకువచ్చి చిరంజీవిని ట్రోల్ చేయడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మెగా కోడలు, వరుణ్ తేజ్ భార్య లావణ్య త్రిపాఠి సోషల్ మీడియాలో గట్టిగా స్పందించారు. కుటుంబానికి సంబంధించిన సంతోషకరమైన క్షణాలను కూడా వివాదాస్పదం చేయడం సరికాదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి మహిళలను ఎంత గౌరవంగా చూస్తారో తెలియకుండా విమర్శలు చేయడం బాధాకరమని, ఇతరులను విమర్శించే ముందు వారి వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాలని ట్వీట్ రూపంలో పేర్కొన్నారు. తాజాగా మరోసారి ఈ అంశంపై స్పందించిన లావణ్య "మా కుటుంబం జోలికి ఎవరైనా వస్తే అస్సలు ఊరుకోను" అంటూ స్పష్టం చేశారు. చిరంజీవి తన కుటుంబంలోని మహిళలను, ముఖ్యంగా మనవరాళ్లను ఎంతో ప్రేమగా చూసుకుంటారని, ఆయన వ్యక్తిత్వం గురించి మాట్లాడే వారు ఆయన చేసిన సేవల్లో ఒక్క శాతం కూడా చేయలేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. అంటూ ఆమె చేసిన ఆంగ్ల ట్వీట్ కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఇదిలా ఉండగా పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి నటిస్తున్న తాజా చిత్రం 'సతీ లీలావతి'పై కూడా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో లావణ్య సరసన దేవ్ మోహన్ హీరోగా నటిస్తుండగా తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. మొత్తంగా కుటుంబ గౌరవం విషయంలో లావణ్య త్రిపాఠి తీసుకున్న స్టాండ్ మెగా అభిమానులను ఆకట్టుకుంటుండగా సోషల్ మీడియాలో ఈ అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215